ఆదివారం
ప్రజాశక్తి
నవంబర్ 28, 2004

కుమిలిపోతున్న సముద్రాలు

హ్యాపీ బర్త్‌డే

(28-11-2004 నుంచి
4-12-2004 వరకు)

రమ్యకృష్ణ
నవంబర్-28
తులసి-శ్రీనివాసరావు
ఖమ్మం

టి. హరీష్
నవంబర్-30
నాగేశ్వరమ్మ-ఓబన్న
తంగేడుపల్లి-కడప

జి.భవిత
2సం॥, 30.11.2002
యాదలక్ష్మి-దేవోజి
శాతపురం-వరంగల్

పి.శ్రీకర్
6సం॥, 1.12.1998
ఉషా-రమాకాంత్
శ్రీకాకుళం

జి.శశిధర్‌రెడ్డి
6సం॥, 1.12.1998
పుష్ప-వెంకట్‌రెడ్డి
ఉప్కిల్ల-నల్లగొండ

సిద్దెల రూబేంద్ర
4సం॥, 1.12.2000
కేన్యాజ్యోతి-నొవాకు
దోలాస్‌నగర్-గుంటూరు

హరిప్రియ
డిసెంబర్-2
భాగ్యలక్ష్మి-లక్ష్మణ్‌స్వరూప్
బోధన్-నిజామాబాద్

జి. సంకీర్త్
7సం॥, 3.12.1997
స్వాతి-శ్రీనివాసాచారి
మిర్యాలగూడ-నల్లగొండ

పి. యామిని శివ పార్వతి
2సం॥, 4.12.2002
రమాదేవి-భాస్కర్
శింగరాయకొండ-ప్రకాశం

టి. చంద్రమహేష్ అంబేద్కర్
1సం॥, 4.12.2003
అక్కమ్మ-చెన్నకేశవులు
యర్రగొండపాలెం-ప్రకాశం

ఐల
2సం॥, 4.12.2002
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

జి. సౌమ్య
4సం॥, 4.12.2000
హిమబిందు-రామలక్ష్మయ్య
రేణిగుంట-చిత్తూరు

వి. నిఖిల్‌సాయికుమార్
7సం॥, 4.12.1997
ఉదయశ్రీ-శ్రీనివాసరావు
హుజూర్‌నగర్-నల్లగొండ

వై. వైష్ణవి
3సం॥, నవంబర్-2001
చంద్రకళ-శ్రీనివాస్
సిద్దిపేట-మెదక్

ఎన్. స్వేచ్ఛ
నీరజ-పరశురాములు
మిడిదొడ్డి-మెదక్

చిన్నారి
2సం॥, నవంబర్-2002
కృష్ణకుమారి-సీతారాములు
విశాఖపట్నం

సిహెచ్.శిరీష
8సం॥, నవంబర్-1996
అంజలి-రాజారావు
విజయవాడ

పి. రేణుక
5సం॥, నవంబర్-1999
కృష్ణవేణి-స్వామి
మెర్సిరాల-నల్లగొండ

చిన్ని సుస్మిత
4సం॥, నవంబర్-2000
పద్మ-వెంకటేశ్వర్లు
కోడూరు-నెల్లూరు

జి. రవళి
5సం॥, నవంబర్-1999
విజయమ్మ-పాండు
తుంగతుర్తి-నల్లగొండ

సునీల్ కుమార్
3సం॥, నవంబర్-2001
జయలక్ష్మి-ధనుంజయ్
కల్లూరు-కర్నూలు

వై. రోజలిన్
5సం॥, నవంబర్-1999
ఏసురత్నం
వరంగల్

ఆర్. ఆదర్శ్
3సం॥, నవంబర్-2001
సువర్ణ-శ్రీనివాస్
సంగారెడ్డి-మెదక్

మమత
1సం॥, నవంబర్-2003
వదిన-రాము
నల్లగొండ

రమేష్
4సం॥, నవంబర్-2000
వదిన-రాము
నల్లగొండ

జి.నీహారిక
4సం॥, నవంబర్-2000
వసంతకుమారి-సోమేశ్వరరావు
పూండి-శ్రీకాకుళం

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



మా గురించి...

నవంబర్ 14వ తేదీ కవర్‌స్టోరీ "ప్రియమైన పిల్లల్లారా..." చాలా బాగుంది. మాతో డైరెక్టుగా మాట్లాడినట్లే ఉంది. ఒడిలో కూర్చోబెట్టుకుని తాతయ్య కబుర్లు చెప్పినట్లుగా ఉంది. చాలాచాలా మంచి విషయాలు అర్థమయ్యేలా రాశారు. మా ఫ్రెండ్స్‌కి కూడా చూపించి చదివించాను. అప్పుడప్పుడు ఇలా మా గురించి మాకు అర్థమయ్యేలా మరిన్ని రాయాలని కోరుకుంటున్నాను.

-జొర్రీగల స్ఫూర్తి,
ఠాగూర్ విద్యాలయం, చిట్యాల, నల్గొండజిల్లా

బాగుంది

బాలల దినోత్సవం(14వ తేదీ), ప్రపంచ.దినోత్సవం(20వ తేదీ) సందర్భంగా రాసిన కవర్‌స్టోరీ బాగుంది. పిల్లల గూర్చి చదువే ఫస్ట్, టీవితోనే టైం గడిపేస్తే వేస్టు అనే విషయాలు చక్కగా వివరించారు. పిల్లలు దేనిని నేర్చుకోవాలి, ఏఏ వుస్తకాలు చదవాలి, వేనిని గూర్చి తెలుసుకోవాలి సమగ్రంగా వివరించారు. అందరం ఒక్కలాగ వుండాలంటే ఏ రీతిన మెలగాలి, శాంతి కోసం మనం ఏం చెయ్యాలి లాంటి విషయాలు చదివి, మా పాఠశాల విద్యార్థులకు వివరించాను. ఆరోగ్యం పేజీలో 'ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా 'అదుపులేని సుగర్ వ్యాధి, అనారోగ్యానికి పునాది' చదివి విపులంగా తెలుసుకున్నాం. టూరిస్ట్ గైడ్‌లో 'మైసూర్' ప్రాంత విశేషాలు తెలుసుకున్నాం.

- కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా

నేటి బాలల గురించి...

వేదికలెక్కే రాజకీయనాయకులు కొందరు 'నేటి బాలలే రేపటి పౌరులు' అని ఉపన్యాసాలు దంచుతారు. కానీ బాల కార్మిక వ్యవస్థ విషయంలో ఎవ్వరూ పట్టించుకోరు. ఈ పరిస్థితిలో బాలల గురించి చక్కటి కవర్‌స్టోరీ అందించిన ప్రజాశక్తికి అభినందనలు.

-శిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడరూరల్



టూరిస్టుగైడ్

మైసూర్ కు చెందిన ఆర్టికల్ ఆద్యంతం ఆసక్తితో చదివింపజేసింది. శాతవాహనులు, చాళుక్యులు కళాభిమానులై సుందర కట్టడాలు నిర్మించడం, వారి తర్వాత సుల్తానులు, నవాబులు కూడా కళాభిరుచితో వాటిని ఇంకా ఆకర్షణీయంగా, అందంగా తీర్చిదిద్ది మనకందించడం ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించింది.

-ఎండి ముస్తఖీమ్,
కొల్లాపూర్, మహబూబ్‌నగర్‌జిల్లా.

విబి రాజేంద్రప్రసాద్

రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత విబి రాజేంద్రప్రసాద్ గురించి చక్కగా రాశారు. తెలుగు చలనచిత్ర చరిత్రలో తనకంటూ ప్రత్యేకస్థానం ఏర్పరుచుకున్న జగపతి ఆర్ట్స్ అధినేత విబి నిజంగా ఆ అవార్డుకే గర్వకారణం.

-మేడూరి సత్యనారాయణ,
ఖైరతాబాద్, హైదరాబాదు.

అనుబంధం బాగుంటోంది

మాకు ఇష్టమైన కథలు, శీర్షికలతో ప్రతీవారం అనుబంధం చాలా బాగా వెలువడటం మాకు ఆనందం కల్గిస్తోంది. కవర్‌స్టోరీ, జీవనశైలి, ఔరా, మనలోమాట, రుచి, న్యాయసలహాలు బాగుంటున్నాయి. దినదినాభివృద్ధితో ఇంకా ఎత్తుకి ఎదగాలని కోరుకుంటున్నాం.

-కె ప్రభాకర్, చిమిర్యాల, నల్గొండజిల్లా

హేపీ బర్త్‌డేలు

ప్రతి ఆదివారం సంచికలోనూ హేపీ బర్త్‌డే శీర్షిక, కలం స్నేహం శీర్షిక చాలా బాగుంటున్నాయి. ప్రతి అనుబంధం పాఠకులను ఆకర్షించే రీతిలో రకరకాల శీర్షికలతో ముస్తాబవుతున్న తీరు బాగుంది. ఔరా శీర్షికలోని 'కుక్క' గురించి ఆశ్చర్యం కల్గించింది.

- చింతా కృష్ణమోహన్, విజయవాడ

కలలు అమ్మబడును!

జాబ్స్ మార్కెటర్స్ అని ఓ కొత్త అమ్మకపు వర్గం వచ్చిందిలేండి.

వీళ్ళు నిరుద్యోగులకు ఆశల్ని అమ్ముతుంటారు.

టోకువ్యాపారస్తులు వేరే ఉంటారనుకోండి. వీళ్ళు చిల్లరగా... అనగా రిటైల్‌గా అమ్ముతుంటారు.

ఈ మార్కెట్టు ముంబయి లాంటి మహానగరాల్లోనేంటి మన హైదరాబాద్‌లాంటి నగరాల్లో కూడా ఉంది. ఆ మాటకొస్తే నిరుద్యోగం వున్నన్నిచోట్లా ఉందంటాను.

ఓ మోస్తరు సిటీల్లో మనం సిటీబస్సెక్కితే...

"మీరు మీ ఇంట్లో ఉండే నెలకు పదిహేనువేల రూపాయలు సంపాదించే ఉద్యోగం చూపిస్తాం. మమ్మల్ని నమ్ముకోనుడీ...మా నెంబరుకు కాంటాక్ట్ చేయుడీ..."

అని రాసున్న స్టిక్కర్లు అంటించుంటాయి. చూసే వుంటాం. కూర్చోటానికి సీటు దొరకని ఆ నిండు బస్సుల్లో నిలబడ్డవారి కంటి చూపుకి అందుబాటులో ఉంటాయి కదా. నిల్చున్న కాళ్ళతీట మరిచిపోతూ ఓ సారి చదివేసుంటాం కూడా.

ఈ వరసన నిరుద్యోగులకు ఊహాలోకాల్ని ఎకరాలకొద్దీ అమ్ముతుంటారు ఈ జాబ్స్ మార్కెట్టుదార్లు.

ఇంతకీ...

ఈ 'మార్కెట్టు'... ఈ కలలబేహారి ద్వారా మరో మార్కెట్టుకి 'మార్కెట్టు' చూపించేదన్నమాట!

టక్‌చేసి, ఓ టై కట్టో... లంగా-ఓణీ/చీరె మీద కోటువేసో ఇంటింటికీ వాళ్ళ మార్కెట్టుని తీసుకెళ్ళలేకపోతే...

ఇది మా కొత్త కంపెనీ టూత్‌పేస్టండీ...ఇది మహా చక్కనైన సబ్బండీ అని బేరం చేసి గిరాకీ తీసుకురాకపోతే...

ఇట్టాంటోళ్ళను లోపలికి రానీకని అపార్ట్‌మెంట్ల వాచ్‌మేన్‌లకు అల్టిమేటమ్ ఇచ్చినా.... ఎహే పొండవతలికి...పొద్దునే గోల అని అన్నా...కించిత్తు బాధపడకుండా అమ్మకాలు చూపించకపోతే...

అలాంటి పనిలో మన అబ్బాయో, అమ్మాయో ఉన్నా...

ఆ టూరింగ్ ఉద్యోగిని...ఉద్యోగికాని ఉద్యోగిని 'మార్కెట్టు' అమాంతం తోసవతల పడేస్తుందంతే!

మార్కెట్టా...మజాకా?!

✤

ఈ సంచికలో . . .

ఓరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతిసంగతులు . . .	16
నువ్వుద్ది . . .	17
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	20
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

వీడిన కొమ్మా.... రావమ్మా....!

కథ ... 8, 9

జై కిసాన్

రియల్ స్టోరీ ... 14

హృదయాలను రంజింప చేసే పింజరికొండ అందాలు

టూరిస్ట్‌గైడ్ . . . 21

"నాటక ప్రక్రియ సర్వశ్రేష్టమైంది"

కళాసాహితి . . . 22, 23

ఓరా!

అదిరిందీ ఐడియా

ముంబయిలో కాలేజీలకొక సమస్య ఎంతకీ తెగటం లేదు. కాలేజీల్లో క్లాసురూముల బయటే నిలువుజీతం తీసుకునే విద్యార్థులనెట్లా లోపలికెళ్ళేలా చేయాలో పాలుపోడంలేదు. కారిడార్లనూ, కాంటీన్లనూ పట్టుకువేలాడే ఈ స్టూడెంటుసమూహాలను క్లాసురూమ్‌ల్లోకి లాక్కెళ్ళేదెట్లో ఐడియా తోచడంలేదు. ఓ ప్రఖ్యాత కాలేజీవారు ఈ ట్రెండ్‌ని రివర్స్ చేసే ఆలోచన చేశారు. రీడింగ్‌రూమ్‌ల్లోని నిశ్శబ్దాన్ని లైట్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌తో నింపాలని, ఆ విధంగా విద్యార్థులు బోర్ అవ్వకుండా చూడాలని ప్లాను వేశారుట! విద్యార్థులు కుప్పలుతెప్పలుగా క్లాసురూమ్‌లకైతే వెళ్ళారుగానీ...తమ ఫేవరేట్ సాంగ్స్ 'మర్డర్', 'తాళ్' సినిమాల్లోని పాటలు పెడతారా పెట్టరా అని ఒకటే గొడవట. బ్యాక్‌ఫైర్ అంటే ఇదేమరి!!

హ్వా...! హ్వా...!! అఖండభారత్!!!

వొదులొదులు ఖాకీ నిక్కర్లలో దోపిన తెల్లచొక్కాల ఆరెస్సెస్‌కి కుర్రకారులను ఇప్పటి స్టయిల్లో ఆకర్షించాలి కదా...అందుకేనేమో "యా...హ్వా...హ్వా...హ్వా" కరాటే శిక్షణలు కూడా పెట్టారు. ఎక్కడైనా ఏమోగానీ పశ్చిమబెంగాల్‌లోని యువతరాన్ని ఆకట్టుకోవడానికి నానాతంటాలు పడాల్సివస్తున్నట్లుగా ఉంది. కుర్రకారు ఈ మధ్య అంత తేలిగ్గా దొరకట్లేదుట. బతుకుతెరువు జీవనపోరాటం చిన్నప్పటినుంచే మొదలవ్వటంతో వీళ్ళ మొరాలకించే వాడు దొరక్క ఏకంగా వీరే తమ 'శాఖ'ల టైములను సర్దుబాటు చేసుకున్నారు. చిన్న చిన్న పనులకెళ్ళి తిరుగొచ్చేప్పటికి ఏ వేళవుతుందో కదా... అందుకని ఉదయప్పూట శాఖలనే మరింతగా పెంచుకున్నామని జ్యోతిర్మయి చక్రవర్తి అను బెంగాల్‌లోని ఒక ప్రధాన్ కార్యనిర్వాహక్ ఘోషిస్తున్నారు. స్వదేశీ జపమానసధనులకీ విదేశీ మార్షల్ ఆర్ట్ అయిన కరాటే, కుంగ్ ఫూ ఏంటాని నోరెళ్ళబెట్టారా... అదంతే "యా...హ్వా...హ...హ్వా"!

భూత దయా...పాడా...?!

మార్కెట్టు కంట్లో ఏదిపడ్డా అది మార్కెట్టీకరణ కాక తప్పదుమరి! కుక్కల్ని తమ ముద్దుకొద్దీ పెంచుకుంటుంటారు కదా కొందరు. ఆ ముద్దూమురిపాన్ని ఆసరా చేసుకుని జపాన్‌లోని టోమీ కంపెనీవారు ఇటీవలే "38జి వండర్‌ఫుల్ షాట్" రకపు కెమెరాను బజార్లోకి దించింది. "ఆ కెమేరాను మీ బుజ్జికుక్కపిల్లదాని మెడలో వేలాడదీయండి. ఆ కుక్కమ్మ దృష్టిలోంచి తీయబడు 90 స్నాప్‌ల ఫొటోలను చూసి ఆశ్చర్యపోండి లేదా మురిసిపోండి" అని ప్రకటనాపూర్వక ఊరింపులు కూడా చేస్తున్నారు. లక్షా యాభైవేల కెమేరాలు ఒక్కపెట్టున మొదటి సంవత్సరానే అమ్మేయాలని తలంచారుట. హిప్‌హిప్...భొభొ...హుర్రే!!!

కార్టూన్ కదంబం


నాకే తిండిలేదు, వాటినెలా మేపాలి అంటున్నాడు సార్!
పేద కుటుంబానికి గొర్రె లేదా బర్రె స్కీమ్
నారు


అరాఫత్ పోరాట తత్వం టిడిపికి స్ఫూర్తి: బాబు


చట్టసభలో కృషి చేస్తూనే ఉన్నాం, అరుస్తున్నాం...కాయితాలు చిం చేస్తున్నాం...పోడియం దగ్గరికెళ్తున్నాం వెల్‌లో బైఠాయిస్తున్నాం...
అవినీతి నిర్మూలనకు చట్టసభలు కృషి చేయాలి: ఆసియా కామన్వెల్త్ సదస్సు



కుమిలిపోతున్న సముద్రాలు

'నదీనాం సాగరహరి' అనేది సంస్కృతంలో సామెత. నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. వాటిలోని కాలుష్యం కూడా సముద్రంలో కలిసిపోతోంది. అడ్డూ అదుపూ లేకుండా గత కొంతకాలంగా కొనసాగుతున్న కాలుష్యం మహాసముద్రాలను ముంచెత్తుతోంది. సముద్రాల్లో జంతుజీవజాలం నాశనం అయిపోతోంది. సముద్రగర్భాలు కాలుష్యంకోరల్లో చిక్కుకు పోతున్నాయి.

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ప్రపంచ మొత్తంపైన ఏడు భాగాలు నీరు, మూడు భాగాల్లో భూమి ఉందని చెబుతారు. తక్కువ ఉన్న భూభాగం ద్వారా వస్తున్న కాలుష్యం సముద్రాలను ముంచెత్తుతోంది. కష్టమైనా, నష్టమైనా మలినాల్ని తన కడుపులో దాచుకోవలసి వస్తోంది. కొంతకాలం క్రితం వరకూ సముద్రాలన్నీ స్వచ్ఛంగా ఉండేవి. ఆ తర్వాత క్రమంగా మహాసముద్రాల నుంచి మామూలు సముద్రాల వరకూ కలుషితం అయిపోతున్నాయి.

జలసంపదను కొల్లగొడుతూ కాలుష్యానికి కారణమవుతున్న మనుష్యులు ఈ పరిస్థితికి ఎప్పటికైనా చింతించక తప్పదు. నదుల ద్వారా, వర్షపు నీటి ద్వారా, పారిశ్రామిక వ్యర్థ పదార్థాల ద్వారా ప్రతిరోజూ కొన్ని లక్షల టన్నుల చెత్త సముద్రంలో కలుస్తోంది. ఒక ఘనపు మీటరు నీటిలో ఆక్సిజన్, హైడ్రోజన్ కాల్షియం, కార్బన్, సిలికాన్, బ్రోమైన్ మొదలైనవి ఎంతెంత ఉన్నాయో శాస్త్రవేత్తలు తెలుసుకుని నిర్ధారించిన విషయాలు ప్రస్తుతం మారిపోయాయి. సముద్ర గర్భంలో ట్రాకియాపోడా, ఎకినోడెర్మిటా, పోరిఫెరా, అనెలిడా, సీలెంటిరేటా, ప్రోటోజోవా వంటి శాస్త్రీయ నామాలతో వందలాది జీవరాసులు ఉండేవని నిర్ధారించారు. కాలుష్యం సముద్ర గర్భంలో చేరి వాటి వినాశనానికి పరోక్ష కారణమయ్యింది. షార్కు, సీల్సు, డాల్ఫిన్, వేల్సు, కాడ్‌ల్నీ, డుగాంగ్స్ వంటి జలచరాలను వేటాడటం వల్ల నాశనం అయిపోతున్నాయి. అరుదైన తాబేళ్ళు, పీతలు వంటివి కూడా మనిషికి ఆహారం అయిపోతున్నాయి.

సముద్రాలలో క్రమక్రమంగా లవణశాతం అధికం అవుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. శీతల దేశాల్లో కన్నా ఉష్ణప్రాంతాల్లోనూ, పొడి వాతావరణం వున్న ప్రాంతాల్లో ఉన్న సముద్రాల్లో ఇది ఎక్కువగా ఉందని అన్నారు. భూమధ్యరేఖకు దగ్గరగా వున్న మధ్యధరా, ఎర్రసముద్రాలలో అత్యధిక లవణశాతం ఉన్నట్లు గుర్తించారు. ఎర్రసముద్రంలో ఈ కారణంగా జలచరాలు బతికే అవకాశం లేదు. సముద్రస్నానం చేసేవారిని ఇక్కడ లవణరాశులు కదలనీయదు.

సముద్రాల్లో రంగులు :

సముద్రాలు సాధారణంగా నీలంగా కనిపిస్తాయి. ఆకాశం సముద్రంపైన ఉండటం వల్ల ఈ విధంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతారు. ఆకాశంలో మబ్బులు పట్టినప్పుడు సముద్రాల రంగు వేరుగా కనిపిస్తుంది. పచ్చసముద్రంలో నీరు బురద కారణంగా ఆ విధంగా కనిపిస్తాయని చెబుతారు.

ఆర్కిటిక్ మహాసముద్రం చాలా విలక్షణంగా వింతగా ఉంటుంది. ఇందులో అత్యధిక భాగం మంచుతో కప్పబడిపోయి ఉంది. ఎండాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా మంచు కరుగుతుంది. ఈ సముద్రంలో చాలా ప్రాంతాల్లో మంచుగడ్డలు కరుగుతూ ఉష్ణోగ్రతల మార్పుల వల్ల నీటిలో కరిగి నీటి శాతాన్ని ఎక్కువ చేస్తుంటాయి. సముద్రాలు భూమిని కలిసే ప్రాంతంలో ఇసుక ఎక్కువగా

సముద్ర జలరాసులు, సముద్ర అతిథిప్రాణులు విలవిలా...

రోజురోజుకీ సముద్రాలలో పెరిగిపోతున్న కాలుష్యం ముందుగా దానిలో బతికే జలరాసుల ప్రాణం మీదికొచ్చింది.

సీ ఒట్టర్(సముద్రజల క్షీరదం): ఇదొక విచిత్రమైన, అపురూపమైన సముద్రజీవి. ఇది 'ఎన్‌హైడ్రా లుట్రిస్' జాతికి చెందిన జీవి. దృఢమైన శరీరంతో 1 మీటరు పొడవున్నప్పటికీ అన్ని జలచరాలకున్నట్లుగా సముద్రజలాల చల్లదనాన్ని తట్టుకునే కొవ్వుపొరచర్మం దీనికి ఉండదు. అందుకని ఇది తరచుగా తన ఒంటిపై ఒకింత గాలిపొర ఉండేలా చూసుకుంటుంది. సముద్రజలాల్లో జరుగుతున్న చమురు కాలుష్యం వల్ల ఈ సీ ఒట్టర్లు వాటి చర్మ రక్షణకై అవి పాటించే జాగ్రత్తలను తీసుకోలేక ప్రాణాలు కోల్పోతున్నాయి. విలువైన, దళసరి చర్మాలకోసం జరిగే వేటకు, సముద్రాలలో పారబోస్తున్న మడ్డి చమురు కాలుష్యాలకు ఈ జాతి జలక్షీరదాలు అంతరించిపోతున్నాయి.

రకరకాల మత్స్యసంపద: సొరచేపలు, తిమింగలాలు, సీల్ చేపలు, రొయ్య, పీత, నక్షత్ర, సీ హార్స్ తదితర



ఎన్నో రకాల చేపరకాలు ఎంత మానవ వేటకు గురైనా వాటి పునరుత్పత్తికి ఇంకా అవకాశం ఉండి వాటి మనుగడ ఉంది. వాతావరణ కాలుష్యం వల్ల వాతావరణంలో, భూమిపొరల్లో పెరిగిపోతున్న వేడికి సముద్రజలాలు వేడెక్కిపోతున్నాయి. సముద్రజలాల్లో కలుస్తున్న మైక్రో ఆర్గానిజమ్స్, పారిశ్రామిక కాలుష్యం, రసాయినిక, అణుధార్మిక కాలుష్యాల వల్ల ఈ సముద్రజాతులు పూర్తిగా నశించిపోయే ప్రమాదం ఏర్పడింది.



సముద్రజల అతిథులు: కొన్ని రకాల జాతుల కొంగలు, పక్షిజాతులు కొన్ని ఋతువులలో ఈ సముద్రప్రాంతాలకు అతిథులుగా వలసవస్తాయి. విద్యుత్ తీగెల-మైక్రోవేవ్ టవర్ల



ప్రమాదాలు, పారిశ్రామిక, రసాయినిక కాలుష్యాలు, మానవ వేటలాంటి వాటివల్ల కొన్ని నశించుతున్నాయి. దానికి తోడు ఈ సముద్రజలాల కాలుష్యం వీటి పాలిట పెనుముప్పుగా తయారయింది. సముద్రాల ఒడ్డున బతికే జీవులు పెంగ్విన్‌లు, పీతలు, కొన్ని రకాల కప్పలు, తాబేళ్ళు సముద్రజలాల్లోకి వెళ్ళినపుడు వాటికాలుష్యాలకు బలవుతున్నాయి.

పేరుకుపోయి ఉంటుంది. ఈ సమీపంలో సముద్రంలో నీటిమట్టం చాలా తక్కువగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల తీరాల్లో ఏటవాలుగా ఉంటుంది. సముద్రం ఈ ప్రాంతాల్లో వంగి ఉంటుంది. కొంత భూభాగం సముద్రపు నీటిలో కలిసిపోతుంటుంది. ఇటువంటి వాటిని 'కాంటినెంటల్ షెల్ఫ్'లు అంటారు. ఈ సమీపంలో కొండలపై నుండి వచ్చే కాలువలు, ఎర్రమన్ను నేలల నుంచి నదులు, కాలువలు ప్రవహించి, సముద్రాల్లో కలుస్తుంటాయి. ఇటువంటప్పుడు ఈ పరిసర ప్రాంతాల్లో రంగులు మారుతుంటాయి. ఇటువంటి 'కాంటినెంటల్ షెల్ఫ్'లు ఉన్న ప్రాంతాల్లో సముద్రపు లోతులు పెరుగుతాయని నిపుణులు చెబుతుంటారు. కొన్ని సంవత్సరాల వ్యవధిలో వర్షపు నీరు, నదీ ప్రవాహాలు కొట్టుకొని వచ్చి కలుస్తుంటాయి. ఇటువంటి వాటిని 'కాంటినెంటల్ స్లోప్పు' అని వ్యవహరిస్తుంటారు. ఇవికొన్ని చోట్ల మైదానాల్లా ఉండటం వల్ల వీటిపై మన్ను పేరుకుపోయి ఉంటుంది. సముద్ర ప్రాణుల కళేబరాలు, ఇతర అవశేషాలు ఈ ప్రాంతంలో చేరుతుంటాయి.

సముద్రంలో సూర్యకిరణాలు నీటిలో కొంతమేర మాత్రం ప్రయాణిస్తాయి. ఉపరితలంలో కెరటాల కదలికలు ఉన్నప్పటికీ లోపల ప్రశాంతంగా ఉంటుంది. సముద్ర అంతర్భాగంలో ఇసుక పర్రలు, మట్టి వ్యర్థ పదార్థాలన్నీ పేరుకుపోయి ఉంటాయి. నదీ ప్రవాహాలలో చెత్తా చెదారాలు కొట్టుకుపోయినట్లుగా సముద్ర గర్భంలో అంతర్గత కదలికల వల్ల ఇవి కొట్టుకుపోతుంటాయి. ఈ కారణం వల్ల కూడా సముద్రంలో అన్ని ప్రాంతాల్లోనూ రంగులు ఒకే విధంగా ఉండవని విశ్లేషకులు చెబుతుంటారు.

రకరకాల కాలుష్యాలు

సముద్రాలు ప్రతిరోజూ ఎన్నో రకాలుగా కాలుష్యానికి గురవుతున్నాయి. 90 శాతం నదుల వల్ల, 10 శాతం ప్రకృతి కారణంగా సముద్రంలో వ్యర్థాలన్నీ కలుస్తున్నాయి. ఒక ఘనపు మీటరు నీటిలో కాల్షియం, పొటాషియం, సల్ఫర్, కార్బన్, బోరాన్, సిలికాన్ వంటివి ఎంతెంత ఉండాలో శాస్త్రవేత్తలు నిర్ణయించారు. అయితే ఈ నిర్ణయాలు, నిర్ధారణలు ఏ సముద్రానికీ వర్తించడం లేదు.

పరిశ్రమలు, వాహనాలు, తదితరాల వల్ల వాయుకాలుష్యం జరుగుతుండగా అది సముద్రంపై చూపిస్తోంది. ఎన్నో పరిశ్రమలు తమ ఉత్పత్తులు పెంచుకుంటూ ఎందుకూ పనికిరాని వ్యర్థ పదార్థాలను, కలుషిత ద్రవాలను సముద్రాల్లోకి వదులుతున్నాయి. పంటపొలాల కోసం ఉపయోగించే రసాయనిక ఎరువులు, కొంతమేర యంత్రం వాటి అవసరాలకు ఉపయోగపడగా మిగిలిన పదార్థాలు సముద్ర జలాల్లోనే కలుస్తోంది. సముద్రాల్లో కూలిపోయే విమానాలు, పడవల్లో ఇంధనం అందులోనే ఉండిపోతుంది.

దోమలు, ఇతర క్రిములను చంపడానికి ఉపయోగించే డిడిటి, క్లోరిన్, ఆల్డ్రిన్, బిహెచ్‌సి అనే రసాయన పదార్థాలు కూడా సముద్ర కాలుష్యానికి కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 'క్లోరినేటెడ్ పెస్టిసైడ్స్' కలిగి వున్న పెర్సిస్టెంటు ఆర్గానిక్ పొల్యూటెంట్సుగా పిలిచే ఎన్నో రసాయన పదార్థాలు కూడా సముద్రంలో కలిసిపోయి అందులో నీరు కలుషితం కావడానికి కారణమవుతున్నాయి.

పాప్సు కూడా ఒక కారణం

కొన్ని రకాల వస్తువులు పాప్సు విభాగంలోకి వస్తాయి. ఇవి సహజసిద్ధంగా ప్రకృతిలో ఏర్పడినవి కాదు. అంతేకాకుండా సహజ విధానాల ద్వారా వీటిని నాశనం చేయడం కూడా కుదరదు. ఇటువంటి పాప్సు రకానికి చెందినవిగా పాలిథిన్ నంచులను పేర్కొనవచ్చు. ఉపయోగించిన తర్వాత వీటిని నాశనం చేయడం చాలా కష్టం అవుతుంది. ఏ వస్తువైనా, జీవమైనా సహజరీతిలో నాశనం అయిపోయి ప్రకృతిలో కలిసిపోతుంది. కాని ఇవి ఏ విధమైన ప్రకృతి చర్యలకు లొంగవు. ఇటువంటివి 12 రకాల పాప్సు ప్రపంచంలో ఉన్నాయని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (యు.ఎన్.ఇ.పి.) గుర్తించింది. వీటి వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ఆలోచించినప్పటికీ కుదరలేదు. ఇటువంటి వాటివల్ల కూడా సముద్రం తీవ్రస్థాయిలో కలుషితం అయిపోతున్నదని శాస్త్రవేత్తలు నిర్ధారిస్తారు.

బలిసిన దేశాల అణువ్యర్థాలు

ప్రకృతిపరంగా పారిశ్రామికపరంగా జరుగుతున్న కాలుష్యాలకే సముద్రాలు విలవిల్లాడుతుంటే...అమెరికా లాంటి ధనిక దేశాలు మరోరకమైన కాలుష్యాన్ని కలుగజేస్తున్నాయి. తమ దేశాలలోని అణువ్యర్థ పదార్థాలను రహస్యంగానో, బలవంతంగానో తమకు లొంగివుండే బలహీన దేశాల సముద్ర తీరాలలో పారేస్తున్నారు. ఒకవిధంగా తమ "ఆటమిక్ వేస్ట్ డస్ట్‌బిన్"లాగా బీదదేశాల సముద్ర వాకిళ్ళను ఉపయోగించుకుంటున్నాయి. సీల్‌చేసిన పీపాలలో ఈ అణువ్యర్థపదార్థాలను వుంచి లాటిన్ అమెరికా దేశాల, ఆఫ్రికాఖండపు దేశాల తీరాలలో అనేకసార్లు డంప్ చేశారు. పాతబడ్డ తమ ఓడలలో ఉంచి ఆ ఓడలను తమంటే భయపడే చిన్నదేశాల సరిహద్దు తీరాలలో లంగర్‌వేసి అలా వుంచేసేవారు. వాటిలోని అణుధార్మికత కొన్నాళ్ళకు లీకయి సముద్రజలాల్లో కలుస్తాయి. వర్ణించలేని కాలుష్యానికి, ఆయా తీర ప్రజల ఆరోగ్యాలకు, పర్యావరణాలకు ప్రమాదకరంగా తయారయ్యాయి. కొన్ని దేశాల ప్రజలు ఇలాంటి అక్రమ డంపింగ్‌లకు వ్యతిరేకంగా తిరగబడ్డారని వార్తలు కూడా వెలుగుచూశాయి.

కాలుష్యంలో జలచరాలు విలవిల

సముద్రంలో ఏర్పడుతున్న కాలుష్యం జలచరాలపై కూడా ఎంతో ప్రభావాన్ని చూపిస్తోంది. సముద్ర తీర ప్రాంతాల్లోనే అత్యధిక జనాభా నివసిస్తోంది. ప్రస్తుతం వందల రకాలుగా వున్న 'ఆర్గానో క్లోరిన్స్' సముద్రంలో కలుస్తున్నాయి. వీటివల్ల సముద్రంలో

జలచరాలు కూడా బలవుతున్నాయి. డాల్ఫిన్, వేల్సు, సీల్సు వంటి చేపలు వీటి తాకిడికి ఎక్కువగా గురవుతున్నాయి. చేపలకు శాపంగా తయారైనా మైక్రో ఆర్గానిజమ్స్, పాథోజెన్ వంటి వాటి కారణంగా జలజాతులు ఎన్నో అంతరించిపోతున్నాయి. బంగ్లాదేశ్, భారత్, ఇతర ఆసియా ప్రాంత సముద్రాల్లో రసాయనిక కాలుష్యం వల్ల ఎన్నో జాతుల చేపలు విలవిలలాడుతున్నాయి. చేపల వేటకు ఉపయోగపడే ఇంజను బోట్ల వల్ల, సీసం, ఆయిల్, రాగి, ఇనుముల తాలూకు అవశేషాలైన నైట్రోజన్ నిక్షేపాలను సముద్రంలోకి వదులుతుంటాయి. వీటివల్ల సముద్రంలో నాచు పదార్థాల్లాంటి 'ఆల్గేలు ఏర్పడతాయి. ఇవి ఆక్సిజన్ శాతాన్ని తగ్గించి చేపల మరణాలకి పరోక్ష కారణాలవుతున్నాయి.

భారతదేశంలో ఒక అంచనా ప్రకారం ప్రతి ఏడాది 1,645 ఘనపు కిలోమీటర్ల నీటిలో రకరకాల వ్యర్థ పదార్థాలు కలుస్తున్నాయి. వీటిలో 32 వేల మెట్రిక్ టన్నులు మాత్రం నీటిలో కరుగుతుండగా 1.35 లక్షల మెట్రిక్ టన్నులు కరగకుండా పేరుకుపోతున్నాయి.

తమిళనాడు, పాండిచ్చేరి తీర ప్రాంతాల్లో సిమెంట్, రసాయన, పంచదార, వస్త్ర పరిశ్రమల వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయి. బొంబాయి తీరంలో లీటరు నీటికి 820 మైక్రోగ్రాముల సీసం, 336 మైక్రోగ్రాముల కాల్షియం ఉంటోంది. కర్ణాటక రాష్ట్రంలో నదులు రోజూ 30 టన్నుల ఆర్గానిక్ కాలుష్యాన్ని సముద్రంలోకి వదులుతున్నాయి. ఈ కారణంగా సముద్రంలో సంచరించే రకరకాల జీవజాలం మనుగడకు ముప్పు ఏర్పడుతోంది. సీల్ చేపల్లో దాదాపు 30 రకాలు వున్నాయి. ఇయర్డు సీల్సు, సీ లయన్సు, లియోపార్డ్, రిబ్బన్, ఎలిఫెంటు సీల్సు వంటివి కూడా చాలా నశించిపోతున్నాయి.

ప్రపంచమంతా సమస్యే

సముద్ర కాలుష్యం ఒక ప్రాంతానికో ఒక ఖండానికో, సముద్రానికో సంబంధించిన అంశంగా లేదు. ఏ సముద్రం చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లు అన్నీ ఒకే విధంగా ఉన్నాయి. ఐరోపా ఖండానికి చెందిన అయిదు ప్రధాన నదులవల్ల నల్లసముద్రం కలుషితం అయిపోతోంది. ఇక్కడ ఏడాదికి తొమ్మిది లక్షల టన్నుల మత్స్య సంపదను సేకరించేవారు. అయితే జలాల కాలుష్యం వల్ల ఉత్పత్తి మూడు లక్షల టన్నులకు పడిపోయింది. నల్ల సముద్రంలోకి ఒడెస్సా ఓడరేవు నుంచి రసాయనిక పదార్థాలు వదలడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఉత్తర అమెరికాలో ఆరు రాష్ట్రాల తీరరేఖ వెంబడి కూడా ఈ కాలుష్యం పెరిగిపోయింది. 'చెసాపీక్ బే' ప్రాంతమంతా పాడైపోయిందని ఆ దేశ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. న్యూయార్క్, ఫిలడెల్ఫియా ప్రాంతాల నుంచి పారిశ్రామిక కాలుష్యం ఎక్కువగా సముద్రాలను ముంచెత్తుతోంది. రెడ్‌సీలో లవణ శాతం మరింతగా పెరిగిపోతోంది. ఆర్కిటికా, అంటార్కిటికా, అరేబియా వంటి మహాసముద్రాలు కూడా కాలుష్యానికి మినహాయింపుగా ఉండటం లేదు.



1. ఆమ్ల వర్షాలు
2. రసాయనిక ఎరువుల కాలుష్యం
3, 4. పరిశ్రమల కాలుష్యం
5. టాక్సిక్ కాలుష్యం
6. అణు, యుద్ధ నౌకల కాలుష్యం

కాలుష్య నివారణకు ప్రయత్నాలు

ప్రపంచంలో సముద్రాలు రానురాను కలుషితం అయిపోతుండటం పట్ల అందరూ అప్రమత్తం అవుతున్నారు. అమెరికాలో జలవనరులకు ఎదురవుతున్న ఆపదలను పసికట్టిన మేధావులు ఉద్యమాలు సాధించడానికి నడుం బిగించారు. ధరిత్రీ సదస్సులో ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్యం దిశలో ముందడుగులు వేయడాన్ని అందరూ హర్షిస్తున్నారు.

అంతర్జాతీయ సమస్యగా తయారైన డిడిటి వంటి రసాయనాల వాడకం, పాప్పు నిషేధం వంటివి చేపట్టినప్పుడే కొంతవరకూ ప్రయోజనం కలుగుతుంది. సముద్ర జలాల్లో వ్యర్థ పదార్థాలు లోపలికి వెళ్ళేటప్పుడు 'సూయజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు' ఏర్పాటుచేసి, ముందుగా శుద్ధిచేసి అప్పుడు సముద్రంలో వదిలినప్పుడు కొంతమేర ప్రయోజనం కలుగుతుంది. కాలుష్యం కూడా కొంత తగ్గుతుంది.

అమెరికాలో న్యూజెర్సీ సముద్ర విభాగమైన 'బోర్నగేట్' ప్రాంతంలో కాలుష్యం పెరిగిపోతోంది. దీనిని కాపాడుకోవడానికి 'ది ట్రస్టు ఫర్ పబ్లిక్ బ్రాండ్' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థను కొంతమంది నెలకొల్పారు. ఇందులో ఎంతోమందిని సభ్యులుగా చేర్చుకున్నారు. ఇందుకోసం 37,500 ఎకరాలను కొనుగోలు చేసి కృషి చేస్తున్నారు. ఫలితాలను సాధిస్తోంది. ప్రతి దేశంలో ఇటువంటి ప్రయత్నం కొంతమేర జరిగినా కాలుష్యం కోరల నుంచి సముద్రాలను రక్షించుకోవచ్చునని వివిధ దేశాలకు చెందిన నిపుణులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

కమిషన్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ (సిఎస్‌డి), యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (యుఎన్ఇపి) అనే సంస్థలు సముద్ర వాతావరణ పరిరక్షణ కోసం ఏర్పడ్డాయి. ఈ సంస్థలు రూపొందించే పథకాల వల్ల కొంతవరకూ ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు.

భారత్, పాక్, శ్రీలంక, మాల్దీవులు, బంగ్లాదేశ్‌లు కలిసి దక్షిణాసియా సముద్రప్రాంత రక్షణ పథకాన్ని సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్నాయి. ఇందుకు సంబంధించి ఒక కార్యాచరణ పథకాన్ని కూడా రూపొందించాయి. సముద్ర వాతావరణాన్ని అధ్యయనం చేసే సంస్థలను ప్రోత్సహించడం, సముద్ర జీవులకు మనుషుల నుంచి రక్షణ కల్పించడం, తీరప్రాంత వాతావరణాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మెరుగుపరచడం, ప్రజలకు సముద్ర కాలుష్యం పట్ల అవగాహన పెంచి సముద్ర పరిరక్షణ గూర్చి తెలియజేయడం వంటి పథకాలను ఇందులో పొందుపరిచారు. వీటిని అమలు చేయడానికి ఉన్న వనరులను ఉపయోగించుకోవాలని సంయుక్తంగా నిర్ణయించుకున్నాయి.

ఈ ప్రయత్నాలు ఒకపక్క కొనసాగుతుండగా ప్రతి వ్యక్తీ తన బాధ్యతగా సముద్రాల్ని, వాటి అందాలను పరిరక్షించాలి. పోటెత్తిన సముద్రాలుగా వాటి ఠీవి ఎప్పటికీ నిలబడాలి. కాలుష్యం కోరల్లో కుమిలిపోకూడదు. ❖



'అరే భాయీ! ఛలో, ఛలో! మజా కరేంగే' అంటున్న ఖాదర్ మాటల్ని రమణారావు ఎన్నడూ ఖాతరు చేయలేదు. ఖాదర్ ఎప్పుడూ జర్దాపాన్ నములుతూ వుంటాడు.

'బ్రదర్ ఇంట్లో కుదరకపోతే హోటల్లో టిఫిన్ చేస్తాం. భోజనం చేస్తాం! మిగతావి అంతే' అంటూ ఎప్పుడూ అమ్మాయిల గురించి చెప్పే శంకరం మాటలూ రమణారావు చెవుల్లో గింగిర్లెత్తుతుంటాయి. ఆఫీసుకు రాగానే వీళ్ళిద్దరూ అందరి బుర్రలు తినేస్తుంటారు.

వీడిన కొమ్మా... రావమ్మా...!

డా॥ నాగినేని భాస్కరరావు

రమణారావుకు కొత్తగా పెళ్ళైంది. ఆర్నెల్లు గడిచినా రమణారావు ముఖంలో సంతోషం కన్పించకపోవటంతో రమణారావు చుట్టూ చేరి వాళ్ళిద్దరూ కూపీలాగసాగారు. రమణ అందగాడు. నిక్కచ్చిగా వుంటాడు. ఆదర్శంగా కట్నం లేకుండా పెళ్ళిచేసుకున్నాడు. అయినా అతనికి సంతోషం లేదు. స్వంత ప్లాటుకు సామానంతా పోగేసినాకే పెళ్ళి చేసుకున్నాడు. కానీ ఎక్కడ లోపమో అతనికి అర్థం కావటం లేదు.

* * *

ఆ రోజు ఆదివారం. కూరగాయల సంచితో లోపలికి వస్తూ 'ఎర్రగడ్డ రైతు బజారు చాలా రష్‌గా వుంది. త్వరగా వంటకానీయ్' అంటూ రమణారావు కూరగాయలు, చేపముక్కలు అందించాడు రమకు.

'చేప కూర వండటం నాకు రాదండీ"

"అరే మరెట్లా? వంట బాగా వచ్చన్నావుగా పెండ్లి చూపుల్లో."

"మరి రాదంటే మీరు చేసుకోరుగా. అందుకే వచ్చని చెప్పా."

రమణారావు డైరెక్షన్‌లో రమ చేసిన వంట అయ్యేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయ్యింది.

"చేపముక్కల్లో ముళ్ళు తీసుకోవటం రాదండీ."

"ముళ్ళు తీసిస్తే తినటం వచ్చా?" వచ్చు.

"ఖర్మ! ఖర్మ! ముళ్ళు తీసిస్తాను. తిను"

భోజనాలయ్యాక, ఆదివారం కదా... బయటికెళ్దాం అంటూ బయలుదేర తీశాడు.

కూకట్‌పల్లి బస్టాండులో బస్సెక్కి మధ్యలో అమీర్‌పేట దిగి ఆమెకు నచ్చిన చీర ఒకటి కొనిచ్చాడు. అక్కడ నుండి అసెంబ్లీ ఎదుట స్టాప్‌లో దిగారు. "ఇదే ఆలిండియా రేడియోస్టేషన్, హైదరాబాద్. దీనికెదురుగా రాష్ట్ర అసెంబ్లీ భవనాలు, పబ్లిక్ గార్డెనూ వున్నాయి. అటువైపుకు వెళ్దాం."

'నెమ్మదిగా నడవండి బాబూ! మీలాగ పెద్ద పెద్ద అంగలు వేసి నడువలేను."

"ఎత్తుకోమంటావా?"

"వద్దులెండి. నెమ్మదిగా నడిస్తే చాలు! పబ్లిక్ గార్డెన్‌లోకి వెళ్దాం." పబ్లిక్ గార్డెన్‌లో డ్వాక్రా మహిళల వస్తువుల ఎగ్జిబిషన్ చూసి, పబ్లిక్‌గార్డెన్ పచ్చిక బయలులో కూర్చున్నారు.

'ఇక్కడ కూర్చో, తినటానికి ఏమైనా తెస్తాను" అంటూ రమణ వెళ్ళి వచ్చాడు పొట్లాలతో.

'అబ్బా మిరపకాయ బజ్జీలా?'

'వాటితో పాటు ఐస్‌క్రీమ్, బిస్కట్లు, అరటిపండ్లు కూడా తెచ్చాను.'

'ఇవన్నీ తింటే రాత్రికి భోజనం చెయ్యనక్కర్లేదు.

'సరే కానివ్వు. ఇక్కడే లలిత కళాతోరణంలో ఏదో ప్రోగ్రాం వుంది చూసి ఇంటికెళ్ళిపోదాం".

లలిత కళాతోరణం తెలుగు సాంస్కృతీ వైభవాన్ని ప్రతిబింబిస్తున్నది. స్టేజి ముందు కుర్చీలు సగం ఖాళీగానే వున్నాయి. మహమ్మారి 'ఎయిడ్స' గురించి కార్యక్రమం నడుస్తున్నది.

"ఇది అంటించుకుంటేనే వచ్చే జబ్బు కాని అంటుకునే జబ్బు కాదు. 80 శాతం లైంగిక సంపర్కం ద్వారా వస్తుంది. రక్త మార్పిడిలో పొరపాటున ఆ రక్తం ఎయిడ్స రోగిదైతే తీసుకున్నవారికి ఎయిడ్స వస్తుంది. హెచ్.ఐ.వి. రోగి అయిన తల్లిద్వారా పిండంలోని శిశువుకు వస్తుంది. అట్లాగే కలుషిత సూదులు, ఇతర పరికరాల ద్వారా, క్షౌరశాలలో ఎయిడ్స్‌రోగికి వాడిన కత్తులు, బ్లేడులు, మొదలగు వాటి ద్వారా ఎయిడ్స వస్తుంది. కనుక ప్రజలారా ఎయిడ్స్‌ను పారదోలాలి. అంటే వివాహానికి ముందు, వివాహం అయిన తరువాత అక్రమ సంబంధాలు ఉండకూడదు. రక్తదానం తీసుకుంటే హెచ్.ఐ.వి పరీక్షలు చేసి హెచ్.ఐ.వి. నెగెటివ్ దాతనుండే తీసుకోవాలి. ఎప్పుడూ శుద్ధి చేయబడిన లేక శుద్ధి చేయబడిన వాడిపారేసే ఇంజక్షన్ సిరంజీలు, సూదులనే వాడాలి. మంగలిషాపుకెళ్తే కొత్త రేజరు, బ్లేడులనే వాడమనాలి. కత్తెరలను, దువ్వెనల్ని డెట్టాల్ నీళ్ళతో కడగమని చెప్పాలి" అంటూ స్టేజిమీద ఉపన్యాసకుడు గంభీరంగా చెప్తున్నాడు.

"ఏమండీ! ఇక్కడెందుకు బయటకు వెళ్దాం అంది' రమ. 'నీకీ కార్యక్రమం నచ్చలేదా. సరే పోదాం పద' అంటూ రమణారావు బయటకు వచ్చాడు భార్యతో.

"టైమ్ రాత్రి 8.30 గంటలైంది. ఇక్కడ

దగ్గర్లోని హోటల్లో భోజనం చేసి సెకండ్‌షో సినిమా చూసి ఇంటికెళ్దాం'

"నాకు భోజనం వద్దండీ!'

'పోనీ టిఫిన్ చేసి వెళ్దాం! పద మంటూ రమను ముందుకు నడిపించాడు రమణ. కెపిహెచ్‌బిలోని విశ్వనాథ థియేటర్‌లో 'ఠాగూర్' సినిమా చూసి ఇంటికి చేరేసరికి రాత్రి ఒంటిగంట అయ్యింది.

'రమా సినిమా బాగుందా?'

'బాగుంది కానీ సినిమాల వల్ల సమాజం మారుతుందా? నాకు నిద్రొస్తోంది బాబూ!' అంటూ రమ నిద్రలోకి జారుకుంది. కంచం దగ్గరే కాని మంచం దగ్గర సుఖం లేదనుకుంటూ రమణారావు నిద్రరాక చాలసేపు అటు ఇటూ దొర్లి ఎప్పటికో నిద్రపోయాడు.

రమణకు రానురాను జీవితం విరక్తిగా సాగుతున్నది. ఖాదర్, శంకర్‌ల గోల కొద్దికొద్దిగా వినపడుతున్నది. తన పట్ల తనకే జాలి వేస్తున్నది. తల్లిదండ్రులు తెచ్చిన ఎన్నో సంబంధాలను తిరస్కరించి బీదింటి అమ్మాయి అణుకువగా వుంటుందని ఏరికోరి రమను చేసుకుంటే పరిస్థితి తారుమారైంది.

* * *

ఒక రోజు ఆఫీసుకి చేరిన రమణారావుకి ఆఫీసంతా ఖాళీగా వుంది. ఏంటని అడిగితే ఆరోగ్యం బాగోక హాస్పటల్‌లో జాయిన్ అయిన కొలీగ్ శంకరంకు ఈ రోజు ఉదయం సీరియస్‌గా ఉందని తెలిస్తే అందరూ వెళ్ళారని తెలిసింది. తనూ హాస్పటల్‌కి వెళ్ళాడు. హాస్పటల్ బెడ్‌పై దాదాపు కోమాలోకి వెళ్ళే స్థితిలో వున్నాడు శంకరం. కలవరింతగా ఏవిటేవిటో మాట్లాడుతున్నాడు.

"ఇదుగో బ్రదర్స్ కాకిలాగా వెయ్యేళ్ళు బ్రతికేకంటే, కోకిలలాగా వందేళ్ళు బ్రతికితేచాలు. సంప్రదాయమంటూ ఏకస(ప)తీ వ్రతమంటూ కాలాన్ని వృధా చేసుకోకండి".... శంకరం కలవరింతలు ఎడతెరిపి లేకుండా...

'ఒరేయ్ మగాళ్ళూ! మగాళ్ళలా బ్రతకండి!" శంకరం అరుపులు. అంతలోనే అరుపులు ఆగిపోయాయి. శంకరం మళ్ళీ స్పృహ తప్పాడు. అతన్ని అత్యవసర చికిత్స వార్డులోకి తీసుకెళ్ళారు.

ఆఖరి దశలో ఎయిడ్స్ రోగంతో మరో రెండ్రోజులకు చనిపోయాడు. అతని శవాన్ని ఎవరూ చేతుల్తో ముట్టలేదు. కట్టెల్తో కదిపి కాల్చేశారు. పాపం భార్య తొమ్మిదో నెల గర్భిణి. సిగ్గుతో బయటికే రాలేదు.

స్నేహితుడే కదా... కొలీగే కదా అని అంత్యక్రియలకెళ్ళి వచ్చాడు రమణ.

'అదిగో మంటలు' మంటలు! శంకరం శవంలోంచి మంటలు అందర్నీ తరుముతున్నాయి. మంటలు! మంటలు!' అంటూ ఆ రోజు నిద్రలో రమణారావు అరుస్తున్నాడు.

"ఏమండీ! ఏమైంది" అంటూ రమ భర్తను కుదిపిలేపింది. "ఆ! ఏం లేదు మంచినీళ్ళు ఇవ్వు". నీళ్ళు తాగి శంకరం తిరుగుళ్ళ గురించి, అతని చావుకు కారణం గురించి, అతన్ని ఎలా దహనం చేసిందీ చెప్పాడు రమణ.

* * *

రమణారావుకు అంతా అయోమయంగా వుంది. రమ వంట చేస్తుంది. ఇంటిని శుభ్రపరుస్తుంది. బట్టలుతుకుతుంది. అన్నం పెడుతుంది. కాని సంసారం చేయటం లేదు. గట్టిగా అడిగితే ఏడుస్తుంది. చెడు తిరుగుళ్ళు తిరగటం రమణారావుకు ఇష్టం లేదు. పెళ్ళయి ఆర్నెల్లు అయినా ఆమె దూరంగానే వుంటున్నది.

"రమా ఎందుకిలా చేస్తున్నావ్?" రమ మౌనం.

"నిన్నే అడుగుతున్నా... అసలు పెండ్లి ఎందుకు చేసుకున్నావు? నన్ను యిలా బాధపెట్టడానికా లేక నీ తిండి తిప్పలు చూసుకోటానికా? మిగతా అన్ని విషయాల్లో బాగానే వుంటారు. ఈ రోజు ఏదో ఒకటి తేలాలి. నీవు ఎందుకు నాతో సంసారం చేయటం లేదు. ఇష్టం లేదా? మరి పెండ్లికి ముందే ఎందుకు చెప్పలేదు?" రమణారావు అడిగాడు.

''అవును చెప్పలేదు. అప్పుడు చెప్పాలనిపించలేదు. సంసారం నాకిష్టంలేదు." రమ బదులు పలికింది.

"మనం కలిసి వుండటంలో అర్థం లేదు కదా. నీకు నచ్చకపోతే ముందే చెప్పాల్సింది. నిన్ను బలవంతంగా అనుభవించినా అది వ్యభిచారమే అవుతుంది.

"మీరు మరో పెళ్ళి చేసుకోండి."

"ఒక భార్య వుండగా మరో పెళ్ళా? నీకేమైంది?"

"నేను మీకు విడాకులు ఇస్తాను ఆ ఏర్పాట్లు చేయండి. ఆ తరువాత మీరు మరో వివాహం చేసుకోండి.

''చూడు రమా! నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. చెడు తిరుగుళ్ళు తిరగను. భార్యతోనే నేను వైవాహిక జీవితం గడపాలనుకుంటున్నాను. నీ నిర్ణయం అంతిమంగా అదే అయితే అలాగే చేద్దాం. ఇష్టం లేని నీతో నేనూ వుండలేను. రేపు లాయరును సంప్రదించి విడాకులు తీసుకుందాం."

"అలాగే చేయండి. నేను మీకేమీ కట్న కానుకలు యివ్వలేదు. మీరిచ్చిన నగలు, బట్టలు మీరే తీసుకోండి."

"వద్దు నీవే లేనపుడు ఆ నగలు, బట్టలు నాకెందుకు? నీవే వుంచుకో."

* * *

పరస్పరం అంగీకారం వుండటంతో చాలా త్వరగా అంటే ఆర్నెల్ల లోపే రమణారావుకు, రమకు విడాకులు మంజూరయ్యాయి. రమణారావు బాధగానే విడాకులు తీసుకున్నాడు.

ఆ రోజు గురువారం ఉదయం 9 గంటలకు రమను విజయవాడ వెళ్ళే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కించాడు. రమ కన్నీళ్ళతో వీడ్కోలు పలికింది. మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను క్షమించమని కోరింది. రైలు కదిలే దాకా వుండి రమణారావు స్టేషను బయటకు నడిచాడు. సికింద్రాబాద్ స్టేషన్నుంచి ఆఫీసుకెళ్ళకుండా తిన్నగా ఇంటికివచ్చి పడుకుందామని మంచం మీద వాలిన రమణారావుకు దిండు కింద ఒక కవరు కన్పించింది. అందులో

"అయ్యా...

మిమ్మల్ని ఇలాగే పిలవాలనిపిస్తుంది. ఎందుకంటే పెళ్ళయిన తరువాత మీతో దాదాపు సంవత్సరం వున్నా నన్నెప్పుడూ మీరు బాధ పెట్టిన సందర్భం లేదు. మీలాంటి మంచి భర్త లభించినా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నాది. ఈ సంవత్సరం కాలం మీరు నన్ను ఒక తండ్రిలా సాకారు. అందుకే మిమ్మల్ని అయ్యా! అని పిలుస్తున్నాను.

మీలాంటి ఆదర్శ జీవులు వుండబట్టే ఇంకా ధర్మం, న్యాయం, నీతి అనే పదాలు నిఘంటువుల్లో వున్నాయి. భార్య వుండగానే అనేక మంది మగాళ్ళు ఇతర ఆడవాళ్ళ వెంట పడతారు. రోగాలు తెచ్చుకొని భార్యలకు అంటిస్తారు. మీరలా చేయలేదు. నేను తిరస్కరించినా మీకు ఆ ఆలోచనలు రాలేదు. మీరు చాలా నిష్టగా వున్నారు. నిజానికి నేను మిమ్మల్ని అన్ని విధాలుగా సుఖపెట్టాలి. కట్నం లేకుండా కేవలం పదోతరగతి మాత్రమే చదివిన నన్ను, ఒక బీద కుటుంబంలో పుట్టిన నన్ను వివాహ వేదికలో మీరిచ్చిన ప్రకటనకు నేను రాసిన పోస్ట్ కార్డ్ అందుకుని మీరు నన్ను వివాహం చేసుకున్నారు. నా తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. మిమ్మల్ని ఒక దేవుడిగా భావించారు. కాని మీకు నేనేమీ సుఖాన్ని, భార్యగా జీవితాన్ని ఇవ్వలేకపోయాను. మన పెళ్ళయిన మొదటిరోజే నాకు తెలిసిన ఒక ఘోర విషయం నన్ను మీకు దూరం చేసింది. మన పెళ్ళికి ఆర్నెల్ల ముందే నేను బలహీనంగా వున్నానని, రక్తం లేదని మా ఊళ్ళో ఒక ఆర్.ఎమ్.పి. డాక్టర్ రక్తం ఎక్కించాలని చెప్పాడు. డబ్బు లేదంటే నీవు బీదదానివి, రక్తదాతను నేను చూస్తాను అని చెప్పి మా ఊళ్ళో వున్న ఒక యువకుడి రక్తాన్ని నాకు ఎక్కించాడు. అయితే మన పెళ్ళయిన రోజున ఆ యువకుడు చనిపోయాడు. అతను ఎయిడ్స్ రోగి అని తేలిందట. నేను భయపడిపోయాను. పరీక్షలు చేయకుండా ఎందుకు రక్తం ఎక్కించావయ్యా అని అప్పుడు ఆ ఆర్.ఎమ్.పి.ని అడిగే ధైర్యం లేకపోయింది. ఆ రోజు నుండి మీకు సంసార సుఖం ఇవ్వకుండా వున్నాను. హైదరాబాద్ వచ్చాక మీకు తెలియకుండా రక్త పరీక్ష చేయించుకున్నాను. హెచ్.ఐ.వి. పాజిటివ్ అని తేలింది. ఇక మీకు నేను ఏ విధంగా సంసార సుఖాన్ని ఇవ్వగలను? జరిగింది ముఖతా చెప్పే ధైర్యం లేదు. ఎంతో పవిత్రులైన మీకు అన్యాయం చేయలేక లోలోపల కుమిలిపోయాను. అందుకే మీరంటే ఇష్టం లేదని, మీకు చికాకు కల్పించి విడాకులు తీసుకున్నాను. అయ్యా! నా బీదతనం, అధైర్యం – ఆ ఆర్.ఎమ్.పి. డాక్టర్ తెలిసో, తెలియకో చేసిన ఆ తప్పుడు రక్తదానం నన్ను నరకంలోకి నెట్టేశాయి. అయ్యా! ఈ ప్రపంచంలో ఎయిడ్స్ జబ్బుకు భయపడైనా వ్యభిచారం మానరా? ఈ ప్రభుత్వాలు అందుకు ప్రయత్నించవా? తప్పుడు రక్తదానాలను అరికట్టలేరా? అంతదాకా నాలాంటివాళ్ళు ఏ తప్పూ చేయకుండా ఇలా బలైపోవాలా? అందరూ 'ఒక స్త్రీకి – ఒక పురుషుడు' అన్న నీతిని మీలాగ ఎందుకు పాటించడం లేదు.

అయ్యా మీరు నా పట్ల చూపిన కారుణ్యాన్ని మర్చిపోలేను. నేను ఇక తిరిగిరాను. నా హృదయంలో, మనస్సులో మీరే నా భర్త. ఎప్పటికీ అలాగే వుంటారు. మీరు మరో వివాహం చేసుకోండి.

– సెలవ్ ఇట్లు మీ మాజీ భార్య రమ

రమణారావు ఉత్తరం చదివి, పడక్కుర్చీలో కూర్చుని శూన్యంలోకి చూశాడు. అందుబాటులో వున్నా అందని కొమ్మలా తననిన్నాళ్ళూ విసిగించిన రమ అమాయకమైన ముఖం గుర్తొచ్చింది. రమ హృదయాగ్నిని చదివాక... ఆమె ముఖంలో ఏ పాపమూ తెలియని స్నిగ్ధ కనిపించింది. చేయని నేరానికి శిక్ష అనుభవించబోయే నిర్దోషి నిష్కల్మషం కనిపించింది. కాసేపటికి లేచి ""పిచ్చిపిల్ల దీనికి నేను భయపడతానని అనుకొన్నది" అనుకొన్నాడు.

డాక్టర్ల సలహాతో తగు జాగ్రత్తలతో మరల ఆమెతోనే జీవితం అనుకుని తనభార్యను తెచ్చుకోవటానికి బయలుదేరాడు రమణారావు.

క్రమశిక్షణ, మంచి ఆహారం, అనే రైలు పట్టాలపై...

వైద్యసలహాలనే గ్రీన్‌సిగ్నల్‌తో...

'ఎయిడ్స్'కి దూరం... ఎయిడ్స్‌రోగికి కాదు" అనే నినాదమే రైలు నడక శబ్దాల లయగా....

'నవజీవన్' ఎక్స్‌ప్రెస్‌లా దూసుకెళ్ళాడు రమణారావు తన భార్య రమ వద్దకు.

తల్లిదండ్రుల్ని మార్చాలి

అంపశయ్య నవీన్

"ఎక్కడికో వెళ్ళొస్తున్నట్టున్నారు?"

"మా మనవరాలిని కాలేజీలో దించొస్తున్నాను"

"ఇంతకుముందు మీరు స్కూటర్ మీద మా యింటి ముందునుంచే వెళ్ళారు కదూ?"

"అవును... మీరు ఇంటి ముందు కూర్చొని పేపర్ చదువుతున్నారు. అమ్మాయికి కాలేజీకి టైమైందని ఆగకుండానే వెళ్ళిపోయాను. తిరిగొచ్చేటప్పుడొచ్చి మీతో కాస్సేపు మాట్లాడి వెళ్దామనుకున్నాను."

"మీ స్కూటర్ వెనక కూర్చున్న అమ్మాయి ఏ మనవరాలు."

"మా కూతురు కూతురు..."

"ఏం చదువుతోంది?"

"ఇంటర్మీడియెట్... బై.పీ.సి. దాన్ని డాక్టర్ని చెయ్యాలని మా అమ్మాయి, అల్లుడు రాత్రింబవళ్ళు దానికంటే ఎక్కువగా తాపత్రయపడ్తున్నారు."

"ఇవ్వాళ్ళ అందరు తల్లిదండ్రులూ మీ అమ్మాయి, అల్లుడులాగే వాళ్ళ పిల్లల్ని డాక్టర్లను చెయ్యాలనో, ఇంజనీర్లను చెయ్యాలనో తాపత్రయపడ్తున్నారనుకోండి.... ఇవి రెండు తప్ప... ఈ ప్రపంచంలో మరో వృత్తులే లేనట్టు! చదవడానికి వాళ్ళ పిల్లలకు సహజమైన తెలివితేటలున్నాయా... లేదా అని తల్లిదండ్రులు ఆలోచించడం లేదు. కేవలం కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించి, బండచాకిరీ చేయించి, తమ కలల్ని పిల్లల మీద రుద్ది ఈనాటి పిల్లల్ని ఎంత చెడగొట్టాలో అంత చెడగొడ్తున్నారు. తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల మీద కలిగిస్తున్న ఈ మానసిక ఒత్తిడుల కారణంగా చాలా మంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకొని చనిపోతున్నారు... ఒకప్పుడు పిల్లల మీద ఇంత ఒత్తిడి లేదు. మా తరం తల్లిదండ్రులైతే వాళ్ళ పిల్లలు ఏం చదువుతున్నారన్న దాన్ని గూర్చి పెద్దగా పట్టించుకునే వాళ్ళే కాదు. ఈనాటి తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల చదువులను గూర్చి చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. బోల్డు డబ్బులు కూడా ఖర్చు చేస్తున్నారు. పల్లెటూళ్ళల్లో ఉండేవాళ్ళు పిల్లల చదువుల కోసం తమ కుటుంబాల్ని పట్టణాలకు తరలిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల పట్ల ఇంత శ్రద్ధ తీసుకుంటున్నారంటే అది హర్షించతగిన విషయమే. కానీ దీని వల్ల కొంతమంచీ, కొంత చెడు... రెండూ ఉత్పన్నమవుతున్నాయి."

"మంచేమిటో నాకర్థమవుతున్నది గానీ చెడేమిటో నాకు తెలీడం లేదు."



"చదువంటే నేర్చుకోవడం... ఈ నేర్చుకోవడమనేది ఎలాంటి ఒత్తిడి లేకుండా సహజంగా జరగాలి. శిశువు పుట్టినప్పటి నుంచే ఈ నేర్చుకోవడమనే ప్రక్రియ ప్రారంభమవుతుంది. దాన్ని చదువు వేగవంతం చేస్తుంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క అంశం మీద సహజమైన అభినివేశం, ఆసక్తి ఉంటాయి. వాళ్ళకు ఏ అంశాల మీద ఆసక్తి ఏర్పడుతున్నదో తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ గమనించి వాళ్ళను ఆ అంశాలవైపే మళ్ళించాలి. అంతేగాని వాళ్ళకు ఆసక్తిలేని విషయాల మీదకు వాళ్లను బలవంతంగా మళ్ళించకూడదు. అలా మళ్ళించినప్పుడు వాళ్ళ మేధస్సు మీద ఒత్తిడి పెరుగుతుంది. ఉదాహరణకు లెక్కలంటే ఏ మాత్రం ఇంటరెస్ట్ లేని విద్యార్థిని అతని తల్లిదండ్రులు ఇంజనీరింగ్ చదవమని బలవంతం చేశారనుకో... అప్పుడేమవుతుంది.. ఆ విద్యార్థిమీద ఒత్తిడి పెరుగుతుంది. కార్పొరేట్ కాలేజీల వాళ్ళు రాత్రింబవళ్ళు వాళ్ళ చేత ఎక్సర్‌సైజులూ, హోమ్‌వర్క్‌లు చేయిస్తారు. కఠిన పరిశ్రమతో పిల్లల్ని ఇంజనీర్లుగానో, డాక్టర్లుగానో తయారు చేయ్యవచ్చునని కార్పొరేట్ కాలేజీల వాళ్ళు భావిస్తారు. ఇవ్వాళ ఏ కార్పొరేట్ కాలేజీని చూసినా అక్కడ చదువుతున్న పిల్లలతో 24 గంటలు హోమ్‌వర్క్ పేరుతోనో, స్లిప్ టెస్టుల పేరుతోనో బండచాకిరి చేయిస్తున్నారు. కఠోర పరిశ్రమ చేసినా పిల్లలు పరీక్షల్లో ర్యాంకులను సాధించలేకపోతున్నారు. దాంతో విపరీతమైన నిరాశా, నిస్పృహలకు లోనవుతున్నారు. తల్లిదండ్రులు తమ మీద పెట్టుకున్న ఆశల్ని వమ్ము చేస్తున్నామన్న బాధ ఒకవైపు, తమ తోటి విద్యార్థులు కొందరు తమ కంటె మంచి ర్యాంకులు తెచ్చుకున్నారనీ, తామే ఎందుకూ పనికిరాని వాళ్ళంగా తయారయ్యామన్న ఆత్మన్యూనతా భావం మరోవైపు... ఇవన్నీ కలిసి ఈనాటి విద్యార్థులను మానసికంగా ఎంత కృంగదీస్తున్నాయో వాళ్ళ తల్లిదండ్రులు ఊహించలేక పోతున్నారు. ఇవ్వాళ ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొని చనిపోతున్నారంటే అందుకు ప్రధాన కారణం వాళ్ళను చాలా భయంకరమైన మానసిక ఒత్తిడికి వాళ్ళ తల్లిదండ్రులు గురి చెయ్యడమే.

"దీనికి పరిష్కార మార్గమేమిటంటారు? తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల చదువుల మీద ఇంతశ్రద్ధ తీసుకోవద్దంటారా?"

"తల్లిదండ్రులు వాళ్ళ పిల్లల చదువులను గూర్చి తప్పకుండా శ్రద్ధ తీసుకోవాలి. కానీ ఫలానా కోర్సు మాత్రమే చదవాలని వాళ్ళ మీద ఒత్తిడి తీసుకురాకూడదు. పదో తరగతి వరకు పిల్లలకు అన్ని సబ్జెక్టులూ చెప్పాల్సిందే... ఇంటర్మీడియెట్ కొచ్చాక ఏ కోర్సులో చేరాలో వాళ్ళనే నిర్ణయించుకోమ్మనాలి. వాళ్ళకు సహజంగా ఉన్న తెలివితేటల్ని బట్టే వాళ్ళను వాళ్ళ ఇష్టమైనా కోర్సులను ఎన్నుకునేలా చెయ్యాలి. ఒత్తిడి ఉండకూడదు. తల్లిదండ్రులు తమ కోరికల్ని, కలల్ని తమ పిల్లల ద్వారా తీర్చుకోవాలని ప్రయత్నించకూడదు. ఈ విషయంలో మొట్టమొదట తల్లిదండ్రుల్ని విజ్ఞానవంతుల్ని చెయ్యాలి. మొదట తల్లిదండ్రుల్ని ఎడ్యుకేట్ చెయ్యగలిగితే మన విద్యా వ్యవస్థ కొంతైనా మారుతుంది. నేర్చుకోవడమనేది సంతోషంగా జరగాలే తప్ప అదొక శిక్షలాగా మారకూడదు."

పుప్పాల కృష్ణమూర్తి

గాడిదను తీర్చిదిద్దిన గాడిద



చెన్నారిగూడెంలో రామప్ప అనే యువకుడు వుండేవాడు. అతనికి నా అన్న వాళ్లెవరూ లేరు. తల్లి, తండ్రి చిన్నతనంలోనే చనిపోయారు. ఊళ్లో అడుక్కొని తింటూ, పెద్దవాడయ్యాడు. ఏదైనా పనీపాట చేసుకోమని గ్రామస్థులు చేసే హితబోధ అతని చెవికి ఎక్కేదికాదు.అందరూ వాడిని 'సోమరి గాడిద' అని పిలిచేవారు. గ్రామస్థుల తిట్లు వినీవినీ అతనికి పౌరుషం వచ్చింది. వారి మీద కోపంతో పక్కనున్న ఆర్లెగూడెం దారి పట్టాడు. బాట పక్క మైదానంలో పచ్చిక మేస్తూ ఒక గాడిద కనిపించింది.

"ఎవరిదీ గాడిద? బావుందే..." అనుకుంటూ ముందుకు సాగాడు. ఓ ఇంట్లో పెళ్లి జరుగుతుంటే, అన్నం తిని మెల్లగా చెన్నారిగూడెం దారి పట్టాడు. కొద్దిదూరం వెళ్లగానే అతనికి ఓ రైతు ఎదురయ్యాడు. అతన్ని, "అయ్యా! నేను గాడిదల్ని కొని, అమ్మే వ్యాపారిని. చుట్టుపక్కల ఏ ఊళ్లో గాడిదలు వున్నాయో కాస్త చెబుతారా?" అని అడిగాడు.

"మా ఊళ్లోనే గాదు, చుట్టు పక్కల పన్నెండు ఊళ్లలో గాడిదన్న మాట కూడా వినపడదు" అన్నాడు రైతు.

'అయితే ఆ గాడిద ఈ ప్రాంతానిది కాదన్నమాట. నాకెలాంటి ఆస్తులు లేవు. ఈ గాడిదన్నా నా స్వంతానికి వుంటే బావుండు...' అని ఆలోచిస్తూ నడక సాగించాడు. గాడిద ఒక చెట్టు కింద పడుకొని నెమరు వేస్తూ కనిపించింది. దాన్ని చూడగానే రామప్పకు చాలా ఆనందం కలిగింది.

'దీని యజమాని వుంటే సాయంత్రం తోలుకెళ్లేవాడు కదా! అతను వచ్చేదాక కట్టేసి వుంచుతా_ తప్పేంటి?' అనుకుని కండువాను గాడిద మెడకు కట్టి తానుండే సత్రం దగ్గరకు లాక్కెళ్లాడు. ఎదురుగా వున్న చెట్టుకు కట్టేసి, రాత్రంతా దాని గురించి ఆలోచిస్తూనే నిద్రపోయాడు. నిద్రలో అతనికి గాడిద వల్ల తన పెళ్లైనట్లు కల వచ్చింది. నిద్ర లేచాక, 'ఈ గాడిద నాకు పెళ్లి కూడా చేస్తుందా?' అనుకున్నాడు.

అదే ఊరికి చెందిన వాడు చంద్రయ్య. పొలానికి యూరియా బస్తా తీసుకెళ్లాలనుకున్నాడు. సరిగ్గా అప్పడే అతనికి గాడిదను తోలుకొస్తున్న రామప్ప కనిపించాడు. "గాడిద బావుంది. ఈ బస్తా దాని మీద వేసి పొలం దాకా తీసుకురా. ఐదు రూపాయలిస్తాను" అన్నాడు. ఆ పని చేసి, అతనిచ్చిన డబ్బులు తీసుకున్నాడు రామప్ప. ఇకమీదట అదే పని చేయాలని నిర్ణయించుకున్నాడు. ఊళ్లో వాళ్ల సామాను ఒక చోటు నుంచి మరో చోటుకు గాడిద మీద చేరవేసేవాడు. వాళ్లిచ్చిన తృణమో ఫణమో తీసుకుంటూ, రోజు ఎంతో కొంత సంపాదించసాగాడు. గాడిదను ప్రేమగా చూసుకునేవాడు. దాన్ని పుష్టిగా మేపేవాడు. గ్రామస్తులతో మంచిగా వుంటూ, ఏడాది తిరిగేసరికి వెయ్యి రూపాయలు సంపాదించాడు.

ఒకరోజు గాడిద యజమాని హఠాత్తుగా ప్రత్యక్షమై, "ఏడాదిగా వెతుకుతున్నాను. ఇవాల్టికి దొరికింది. గాడిద ఇక్కడున్నట్లు నాకు నిన్ననే తెలిసింది" అని దాన్ని లాక్కుపోసాగాడు. "అయ్యా! ఇది అన్యాయం. ఇంతకాలం నేను దీని మీదే ఆధారపడి బతుకుతున్నాను. ఇది కాస్తా పోతే నేను తిరిగి బిచ్చగాడిగా మారాలి. మీరైనా చెప్పండి..." అని జనాన్ని వేడుకున్నాడు రామప్ప. గ్రామస్తులు పంచాయతి పెట్టారు. గాడిద యజమాని, రామప్ప తమ వాదనలు వినిపించారు.

గ్రామ పెద్దలు గాడిద యజమానితో "నీ గాడిదను ఇంతకాలం తన దగ్గర వుంచుకొని రక్షించాడు. దొంగల చేతిలో పడి వుంటే కనిపించకుండా పోయుండేది. ఇప్పటివరకూ కాపాడినందుకు గాడిద రేటులో సగం అంటే ఐదు వందలు రామప్పకిచ్చి తోలుకెళ్లు..." అని తీర్పు చెప్పారు. "దీనికి అంత డబ్బు నేనెక్కడినుంచి తెచ్చేది. నాకే ఆ డబ్బు ఇమ్మనండి. మరో గాడిదను కొనుక్కుంటాను" అన్నాడు యజమాని. అందుకు ఒప్పుకున్న రామప్ప తాను దాచిన డబ్బులో ఐదు వందలు గాడిద యజమానికిచ్చాడు. అతను గాడిదను రామప్పకు వదిలేసి వెళ్లిపోయాడు.

రామప్ప గాడిదను ఎంతో ప్రేమగా చూసుకోసాగాడు. కిరాయిలు తోలి జమైన డబ్బుతో ఒక పాత పెంకుటిల్లు కొనుక్కున్నాడు. ఇదంతాచూసిన శంకరప్ప అతనికి తన కూతుర్నిచ్చి పెళ్లి చేశాడు. వారికి ఇద్దరు పిల్లలు కలిగారు. మరికొంతకాలానికి గాడిద ముసలిదై చచ్చిపోయింది. దాన్ని తన పెరట్లోనే పూడ్చి పెట్టి, పైన ఒక వేప చెట్టు నాటాడు. తర్వాత మరో గాడిదను కొనుక్కుని, కిరాయిలు తోలసాగాడు. అయినా తన పాత గాడిదను మరచిపోలేదు. పెరిగి నీడనిచ్చే చెట్టులో తన సోమరితనాన్ని పోగొట్టిన గాడిదను చూసుకుంటూ బ్రతకసాగాడు.



రంగులు నింపేద్దాం!

హాయ్ నేస్తాలూ! ఇదిగో మీ ముందుకు ఓ చిన్నారి పాప వచ్చింది. ఎంచక్కా రెండు పిలకలు వేసుకుని నిలబడిన ఆ పాప భలే ముద్దుగా వుందికదూ. ఇంతకీ ఆమె ఇక్కడకు ఎందుకు వచ్చిందంటే... పాపం తనకేమో రంగు రంగుల బట్టలంటే ఇష్టమంట. కానీ బంతులు వున్న తెల్లగౌను కుట్టించింది వాళ్ల మమ్మీ. మీ దగ్గర రంగులు వుంటాయి కదా. వాటిని తీసి చక్కటి రంగులు నింపేయండి. పాప ఖుషీ అవుతుంది. మీకూ సంతోషంగా వుంటుంది. ఓకేనా!

వి'చిత్రం'

చిన్నారులూ! ఇవాళ్టి వి'చిత్రం'లో ఎవరున్నారు? య్యస్. మన జాతీయ పక్షి నెమలి వుంది. చల్లటి గాలి తగులుతుంటే...పురి విప్పి వయ్యారంగా నాట్యం చేస్తోంది. అవునా. మరి ఈ బొమ్మలోనే నెమలి కాకుండా ఇంకా ఎవరైనా కనిపిస్తున్నారా? లేదా! అర్రే. ఈ బొమ్మలో ఇంకా ఎవరో వున్నారు. వారిని మీరు కనిపెట్టాలి. ఏంటి? అలా బిక్క మొహం వేశారు? చాలా సులభం. నిజ్జం. మేం జవాబు చెప్పాక మీరు ఇదే మాట అంటారు. ముందు ప్రయత్నించి చూడండి. అప్పటికీ తెలీకపోతే జవాబు చూడండి. సరేనా!

జవాబు

ఏంటి? ఎంత ఆలోచించినా, వెతికినా ఎవ్వరూ కనిపించలేదా! అర్రే నేస్తాలూ... మరి మాకు కనిపిస్తున్నారే. సరే జవాబు చెప్పెయ్యమంటారా! ఈ బొమ్మలో నెమలితోపాటు దాన్ని పెంచుకుంటున్న యజమాని కూడా వున్నాడు. ఆయనకు ఈ అందాల నెమలి అంటే బోలెడంత ఇష్టం. దాన్ని ఎంతో ప్రేమగా చూసుకుంటాడు తెలుసా! సరే... మా మాట మీద నమ్మకం లేకపోతే పుస్తకం తిరగేసి చూడండి. నెమలి ముక్కు ఆ యజమాని ముక్కు ఒకటే. ఇప్పుడు మీకు స్పష్టంగా అర్థమైందనుకుంటానే!

ఇప్పుడు మీరేం చెయ్యాలంటే... మేం మిమ్మల్ని అడిగిన ప్రశ్నను మీ స్నేహితులను అడగండి 99శాతం చెప్పలేరు. ఒకవేళ ఎవరన్నా చెప్తే అభినందించండే. ఇప్పటికి టాటా

❋

చిన్నారి చిత్రకారులు

బాలల దినోత్సవం సందర్భంగా గుంటూరులో ప్రజాశక్తి నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో మొదటి మూడు బహుమతులు పొందిన చిత్రాలు

కె.నాగార్జున, 9వ తరగతి, శ్రీవెంకటేశ్వర బాల కుటీర్, బ్రాడీపేట, గుంటూరు.

ఎస్.ఫణీంద్రసాయి, 9వ తరగతి, శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్, గుంటూరు.

ఎ.వి.పవన్ కుమార్, 9వ తరగతి, శ్రీవెంకటేశ్వర బాల కుటీర్, బ్రాడీపేట, గుంటూరు.

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో ఒక మామ్మగారు వచ్చారు. ఈవిడ గొప్ప స్వాతంత్ర్య సమరయోధురాలు. ఒకవేళ మీకు ఈవెడ ఎవరో తెలీక పోయినా మీ పెద్దవాళ్లను అడిగి తెలుసుకోండి. అంతటితో మీపని అయిపోలేదు. చక్కగా ఓ కార్డు తీసుకుని ఆమె పేరు రాసి పంపండి. ఓకేనా. ఈ పని ఇవాళే ఇప్పుడే చెయ్యాలి. మరి మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

గతవారపు సమాధానం:
ఎ.ఆర్.రెహమాన్

సరైన సమాధానాలు రాసినవారు

ఎ.యశ్వంత్, 6వ తరగతి, ఎల్‌బి.స్టేడియం, హైదరాబాదు. యమ్.దాలినాయుడు, యన్.శ్రీను, 10వ తరగతి, అరసాడ, వంగర. మోపర్తి రాజేష్ కిషోర్, ఇంద్ర, శిరీష, గురిజేపల్లి. ఎస్.తరుణేంద్ర, 4వ తరగతి, విజయనగరం. ఎన్.అవినాష్, 10వ తరగతి, విజయవాడ. వై.ఫణి కృష్ణప్రియ, 6వ తరగతి, విజయవాడ. బి.సంపత్‌కుమార్, 10వ తరగతి, చండ్రుగొండ, ఖమ్మం. కె.నరేందర్, 10వ తరగతి, నేరడవాయి, నల్గొండ. సిహెచ్.నాగమణి, 10వ తరగతి, కోదాడ, నల్గొండ. ఎమ్.పెద్దిరాజు, నక్కపల్లి, విశాఖ. కర్లకుంట రాజేష్, 7వ తరగతి, బోనకల్, ఖమ్మం. సిహెచ్.సత్యవతి, 6వ తరగతి, కోదాడ, నల్గొండ. ఎమ్.అరవింద్, 8వ తరగతి, మూసాపేట్, మహబూబ్‌నగర్. ఎమ్.డి.మాలిక్, 8వ తరగతి, మూసాపేట్, మహబూబ్‌నగర్. యమ్.యశ్వంతి, 4వ తరగతి, కొవ్వూరు. వేమూరి శ్రీనీత, 7వ తరగతి, ఘంటసాల. బి.శ్రీహరి, శ్రీకాకుళం.బి.సృజన, 7వ తరగతి, అశోక్‌నగర్, హైదరాబాదు. కె.సుందర్, 8వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు.

కమ్మటి కాఫీ

E	T	H	I	O	P	I	A	I	B	M	U	L	O	C
T	E	M	R	U	O	G	A	C	I	B	A	R	A	H
S	F	R	E	N	C	H	P	R	E	S	S	P	T	I
A	R	A	B	S	T	O	H	S	H	O	P	O	R	C
T	E	C	R	A	G	U	S	P	I	U	R	L	E	O
O	N	I	E	N	S	D	I	U	C	F	K	L	E	R
P	C	R	W	A	J	T	R	C	E	U	C	I	X	Y
E	H	A	O	E	O	J	I	I	D	L	A	M	P	H
N	R	T	R	B	E	N	A	M	P	L	L	I	R	E
I	O	S	G	K	O	N	A	V	U	E	B	L	E	A
E	A	O	A	M	Y	E	T	T	A	L	S	K	S	D
F	S	C	A	R	E	D	N	I	R	G	A	U	S	A
F	T	E	P	I	S	D	N	U	O	R	G	N	O	C
A	R	O	M	A	T	I	C	A	S	M	O	O	T	H
C	O	W	B	O	Y	P	E	R	C	O	L	A	T	E

ఇంగ్లీషు పజిల్-17

హాయ్ పిడుగులూ! అమ్మావాళ్లు కాఫీ తాగుతుంటారుకదా. ఇవాళ్టి మన పజిల్‌లో కాఫీకి సంబంధించిన పదాలు చాలా వున్నాయి. వాటిని కనిపెట్టి కార్డుమీద రాసి మాకు పంపాలి. సరేనా. మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పజిల్-15కు సమాధానాలు రాసినవారు (పేరుపక్కన వున్న నెంబరు వారు గుర్తించిన పదాల సంఖ్య)

ఎం.గురుస్వామి(15), 10వ తరగతి, గద్వాల్, మహబూబ్‌నగర్. **ఆర్.నాగేంద్రబాబు (5)**, 9వ తరగతి, వణుకూరు. **అల్లూరి హేమంత్ (12)**, 9వ తరగతి, దామరమడుగు, నెల్లూరు. **డి.కిషన్ (12)**, **బి.ఆర్.వి.ప్రసాద్**, 10వ తరగతి, **ఇ.సుజాత, జి.కళ్యాణి**, 8వ తరగతి, టేకులపల్లి, ఖమ్మం.

పజిల్-16 సమాధానం

AIR	EMERGENCY	PREVENTION
ALARM	EXIT	RESCUE
ASHES	EXTINGUISH	SIREN
BURN	FIREMEN	SMOKE
CARBON MONOXIDE	FLASHLIGHT	SMOLDER
CHIEF	GAS	SPACE HEATER
CRAWL	HAZARD	SPARK
DALMATIAN	HELP	STAY LOW
DARK	IGNITE	STOP DROP ROLL
DETECTOR	LADDER	SURVIVE
DISASTER	OXYGEN	WATER
DRILL	PREPARE	WINDOW

ఏనుగుల తోరణం

హేయ్ పిడుగులూ...! బావున్నారా? అదిన రేగాని.. పండుగలు, ఉత్సవాలు, పెళ్లిళ్లప్పుడు గోడలకు, స్థంభాలకు ఏం అతికిస్తారు? రకరకాల ఆకారాల్లో కత్తిరించిన రంగురంగుల కాగితాలుకదా. అదేనర్రా! కాగితపు మామిడి పిందెలు, కోతులు, ఏనుగులు, పువ్వుల తోరణాలు రెపరెపలాడుతూ కనిపిస్తుంటాయే అవి. మీరు ఎప్పుడైనా వాటిని తయారుచేశారా! లేదా! అయితే ఇవాళ ఏనుగుల తోరణం ఎలా చెయ్యాలో చెప్పకుందాం.

ఏమేం కావాలంటే... పొడవాటి రంగు కాగితాలు, పెన్సిల్, కత్తెర.

ఎలా చెయ్యాలంటే... ముందు కాగితాన్ని ఒకటవ బొమ్మలో చూపించినట్లుగా మడవండి. తర్వాత పై మడత మీద ఏనుగు బొమ్మ వెయ్యండి. ఇహ అన్ని మడతలు ఒక దగ్గరకు వచ్చేట్టు పట్టుకుని ఏనుగు చుట్టూ కత్తిరించండి. ముఖ్యమైన విషయం ఏంటంటే...ఏనుగు తల తోక కలిసే దగ్గర మాత్రం కత్తిరించొద్దు. తర్వాత ఆ కాగితాన్ని విప్పదీసి చూడండి. చక్కటి ఏనుగుల తోరణం మీ ముందుంటుంది. దీన్ని ఎంచక్కా మీ తరగతి గది గోడలకు అతికించొచ్చు. భలేగా వుంటుంది. ఒకవేళ మీకు రంగు కాగితం దొరకకపోతే... తెల్లకాగితంతో కూడా చెయ్యొచ్చు. కాకపోతే దానికి రంగులు వెయ్యాల్సి వుంటుంది. సరేనా. మరి వారం రోజుల వరకు సెలవ్.







చుట్టూ పంట పొలాలు...
పచ్చటి తివాచీ పరిచినట్లు కనుచూపుమేర పొలాలు విస్తరించి వున్నాయి. పైరగాలి పంట పొలాల పై నుంచి నెమ్మదిగా కదులుతూ ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. చిరుగాలిలో అదోలాంటి వాసన ముక్కు పుటాలకు తగులుతోంది.

జై కిసాన్

పి.ఆర్.పి.వర్మ

కర్నాటకలో మారుమూల కుగ్రామం.
గ్రామం చిన్నదే అయినప్పటికీ అందరూ వ్యవసాయదారులే. ప్రతి ఒక్కరికీ అంతోఇంతో వ్యవసాయ భూమి ఉండటంతో అదే జీవనాధారంగా బతుకుతున్నారు.

విశ్వాస్ మోరే అక్కడికి వచ్చాడు.

పదేళ్ళ వయసు ఉంటుంది.

చురుగ్గా అందంగా వున్నాడు. చేతిలో ఎరువుల సంచి ఉంది. దూరంగా ఉన్న ఎకరం పొలంలో వరిపంట వద్దకు బయలుదేరాడు. పొలం గట్ల వెంబడి నడుస్తూ పొలం వద్ద ఉన్న తండ్రి వద్దకు వెళ్ళాడు.

"ఆలస్యమయిందేం?" జనాబ్ మోర్ ప్రశ్నించాడు.

"ఎరువులున్న సంచి కనిపించలేదు. ఇల్లంతా వెతుకుతూ ఉండిపోయాను... అటకపైన బస్తా వున్న విషయం గుర్తుకు వచ్చి తీసుకొచ్చాను.. అందుకే ఆలస్యం అయింది!" విశ్వాస్ చెప్పాడు.

"అందరి పొలాల్లోనూ దిగుబడి అంతంత మాత్రంగానే వస్తోంది. మన పొలం కూడా అలాగే ఉంది. ఎరువులు దండిగా వేస్తే ప్రయోజనం ఉంటుందని ఆశ!"

"నన్ను చదివిస్తే బాగుండేది నాన్నా!"

"ఈ పరిస్థితుల్లో నిన్ను చదివించడం కష్టం. ఫీజులు, ఇతర ఖర్చులు అవుతాయని కాదు. నా పరిస్థితి అందుకు ఇబ్బందికరం కాదు. అయినా నువ్వు సాయం లేకపోతే నా వ్యవసాయం కూడా సాగదు?"



"అందుకేనా నన్ను బడికి పంపడం లేదు!"

"అవునురా విశ్వాస్... ఈ రోజు చూడు ఎంత పని ఉందో. మనకు అన్నం పెట్టే ఈ పొలాన్ని సారవంతం చేయాలి. ఎరువులు చల్లాలి. కలుపు మొక్కలు తీయాలి."

తండ్రి చెప్పిన విషయాలు విశ్వాస్ మోరేలో ఆలోచనలు రేపాయి. ఏడాది అంతా కష్టపడి పంటలు పండించినా ఎందుకు తినడానికి కూడా ఆదాయం సరిపోవడం లేదో అతనికి అర్థం కాలేదు. చుట్టూ కనుచూపుమేర విస్తరించి ఉన్న పంట పొలాలు కనులకింపుగా ఆనందాన్ని కలిగిస్తున్నా, అతని మదిలో ఏదో చెప్పలేని వెలితి వ్యాపించింది.

"నాన్నా! ఇప్పుడు ఏం చేయాలి..?"

"చాలా పనులున్నాయి. ఎరువులు చల్లాలి ముందు. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. ఇద్దరు పనివాళ్ళను మాట్లాడాను. వారికి నువ్వు సహాయం చేయాలి!"

తండ్రి మాటలతో విశ్వాస్‌మోరే పనిలోకి దిగాడు. ఎరువుల బస్తాలో ఎరువును తీసుకున్నాడు. పంట పొలాల్లోకి స్ప్రే చేయడానికి సిద్ధపడ్డాడు.

కొడుకు సహాయం అతనికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. విశ్వాస్‌ను బడికి పంపి చదివించలేదన్న బాధ మనసు మారుమూలల్లో కలుక్కుమంటున్నా... బాల కార్మికునిగా చేశానన్న బాధ కలిగిస్తున్నా మరో ప్రత్యామ్నాయం కనిపించలేదు.

తను కూడా పనిలో మునిగిపోయాడు.

* * *

బెంగుళూరు బసవగుడి ఆడిటోరియం.

1992 అక్టోబర్ 23.

సి.సి.ఎల్. కంపెనీ ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

నగరంలో ప్రముఖులను, పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

ఆ కంపెనీ రూపొందించిన కంప్యూటర్లను ప్రమోట్ చేయడానికి ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకాన్ని లాంఛనంగా ప్రారంభించింది. ఆ రోజు కంప్యూటర్‌ను కొనుగోలు చేసినట్లయితే ధరలో కూడా రాయితీని ప్రకటించింది.

పదహారేళ్ళ విశ్వాస్ మోర్ ఆ కార్యక్రమానికి అనుకోకుండా హాజర య్యాడు. ఆ కంపెనీ నిర్వహించిన సమావేశాన్ని ఆద్యంతమూ పరిశీలించాడు. మార్కెట్ కమిటీలో పంట అమ్మగా సొమ్ము జేబులో ఉంది. తండ్రి ఏదో పని మీద దావణగేరే వెళుతూ బాంకులో జమ చేయమని ఆ సొమ్మును ఇచ్చాడు.

కార్యక్రమానికి వచ్చిన విశ్వాస్ మోర్‌కు

కంప్యూటర్లు ఆకర్షించాయి. సి.సి.ఎల్. కంపెనీ వాటిని ప్రదర్శిస్తూ అందులో వివిధ అంశాలను ప్రదర్శించడం ఎంతగానో నచ్చింది. ధరలో రాయితీ ఉండటంతో ఒకటి ఎలాగైనా కొనాలని అనుకున్నాడు.

మరి ఆలస్యం చేయలేదు.

జేబులో ఉన్న సొమ్ము కౌంటర్‌లో చెల్లించి ఒక కంప్యూటర్‌ను కొనుగోలు చేశాడు. పాఠశాలకు వెళ్ళలేదు. చదువులేదు. కంప్యూటర్ ఎలా ఆపరేట్ చేయాలో తెలీదు. అయినప్పటికీ కంప్యూటర్ కొన్నానన్న సంతృప్తి ఎంతగానో కలిగింది.

* * *

విశ్వాస్ మోర్ కొనుగోలు చేసిన కంప్యూటర్‌ను ఇంటిలో తన చిన్న గదిలో అమర్చాడు. ముందుగా కంప్యూటర్ శిక్షణా సంస్థలో ప్రాథమిక పరిజ్ఞానాన్ని సంపాదించాడు. నేర్చుకున్న విషయాలను ఇంటివద్ద తన స్వంత కంప్యూటర్ ద్వారా ప్రాక్టీసు చేసేవాడు. క్రమంగా దానిపై పూర్తి అవగాహన ఏర్పడింది.

చిన్నతనం నుంచి వ్యవసాయంపై వున్న ఆసక్తి కారణంగా దానిపైనే విశ్వాస్ కృషి ప్రారంభించాడు. మొదట్లో కొన్ని అడ్డం నిలువు లైన్లతో స్ప్రెడ్ షీట్లు తయారుచేసి పొలం లెక్కలు, పంట వివరాలు, ఎరువుల వివరాలు మొదలైనవి చేరుస్తూ పోయాడు. ఈ ఆసక్తి క్రమంగా పెరిగి, వ్యవసాయంలో కంప్యూటర్‌ను ఎంత లాభదాయకంగా వినియోగించుకోవచ్చో తెలుసుకున్నాడు.

వ్యవసాయమే ప్రధాన వృత్తిగా తన తండ్రి చిన్నతనం నుంచి చేస్తున్న ప్రయత్నాలను ఒక మంచి కార్యరూపంలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. ఎంత కష్టపడి వ్యవసాయం చేస్తున్నా తగిన ఫలితం కనిపించకపోవడం విశ్వాస్‌లో ఆవేదన కలిగించేది. ఎంతోమంది రైతులకు ఉపయోగకరంగా ఉండేందుకు ఏదో చేయాలని అనుకునే వాడు. ఏదో ఒకటి చేయాలి. వ్యవసాయదారులకు ప్రయోజనకరంగా రూపకల్పన చేయాలని నిశ్చయించుకున్నాడు.

తను సంపాదించిన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని రంగరించి ఆలోచించాడు. రెండు సంవత్సరాల కృషితో సాఫ్ట్‌వేర్‌ను తయారుచేశాడు. తన తండ్రి వంటి ఎంతోమంది వ్యవసాయదారుల కోసం తన సాఫ్ట్‌వేర్ ఉపయోగపడాలని విశ్వాస్ భావించాడు.

కంప్యూటర్ అంటే ఏమిటో తెలియని వ్యక్తిగా అందులో పరిజ్ఞానాన్ని సంపాదించడమే కాకుండా సాఫ్ట్‌వేర్ రూపకల్పన గొప్ప పరిణామంగా నిలిచింది.

రైతులకు బాలశిక్ష మాదిరిగా అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా ఈ రూపకల్పన జరిగింది. పంటలకు నీటి తడిపెట్టడం దగ్గర్నుంచి ఎరువులు ఏ పాళ్లలో కలపాలి, ఎన్నిసార్లు స్ప్రే చేయాలన్న పనులన్నీ ఆటోమెటిగ్గా ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో జరిగిపోతాయి. వ్యవసాయం చేసే సమయంలో ఎప్పుడు ఏ పని ఎలా చేయాలని ఒక నిపుణుడు సూచనలు, సలహాలు ఇస్తున్న మాదిరిగా తయారైంది.

దానికి "ఆగ్రోసాఫ్ట్" అనే పేరు పెట్టాడు.

ముందుగా దీనిని అందరికీ చూపించాడు. చూసిన రైతులు, వ్యవసాయ నిపుణులు ఎంతగానో మెచ్చుకున్నారు. తను తయారుచేసిన సాఫ్ట్‌వేర్ అందరి ప్రశంసలు పొందడం పట్ల విశ్వాస్‌మోరే ఎంతో ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

నీటి పంపుకు ఈ సాఫ్ట్‌వేర్ ఉన్న కంప్యూటర్ అనుసంధానం చేస్తే గ్రౌండ్ లెవెల్‌లోని వాటర్ ట్యాంక్ నిండగానే ఇంజన్ ఆగిపోతుంది. అలాగే డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటకు చేరే నీటిలో ఎరువుల మిశ్రమాన్ని ఎంత కలపాలో నిర్దేశిస్తుంది. అంటే నీరు, ఎరువులు మొదలైన అన్ని అంశాలకు సంబంధించిన వివరాలు కంప్యూటర్‌కు మొదటే ఫీడ్ చేసి ఉండటంతో ఈ పనులన్నీ ఆటోమేటిగ్గా జరిగిపోతాయి. ఈ విషయాలను సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి అందరూ ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారు. రకరకాల వ్యవసాయ పనిముట్లు, ధాన్యం ధరలు, ఉష్ణోగ్రత, తేమ వివరాలు మొదలైనవన్నీ ఈ సాఫ్ట్‌వేర్ సాయంతో రైతులు సులభంగా తెలుసుకోవచ్చు.

తాను తయారుచేసిన సాఫ్ట్‌వేర్ రైతులకు ఉపయోగపడుతుందని తెలియడం విశ్వాస్ మోరేలో గొప్ప సంతృప్తిని కలిగించిది.

* * *

"విశ్వాస్ మోరే పాఠశాలలో చదువుకోలేదు. చదివింది కూడా నామమాత్రమే. అటువంటి బడి గడప తొక్కని వ్యక్తి ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు. దేశంలో ఎంతోమంది వ్యవసాయదారులకు ప్రయోజనకరంగా తన కృషిని కొనసాగించారు. రిటైర్‌మెంట్ వయసు దాటినవారు కూడా చేయలేని పనిని పాతికేళ్ళ వయసులో చేశారు. ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచారు. విశ్వాస్ అభినందనీయులు..." వ్యవసాయ పరిశోధనా సంస్థ చటర్జీ ప్రసంగాన్ని ప్రారంభించారు.

ఆడిటోరియంలో కుర్చీలన్నీ నిండిపోయి ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి రైతు ప్రతినిధులు, అధికారులు ఎక్కువమంది హాజరయ్యారు.

తర్వాత విశ్వాస్‌ను ఆహ్వానించారు.

ఆహూతుల్లో రెండవ వరసలో కూర్చున్న విశ్వాస్‌మోరే నెమ్మదిగా లేచి హుందాగా నడుచుకుని వెళ్ళి వేదికను అలంకరించారు.

వేదికపై కూర్చునేంత వరకూ చప్పట్లతో అందరూ స్వాగతించారు.

ఆ తర్వాత విశ్వాస్ మోరే తన సాఫ్ట్‌వేర్ పనితీరును ప్రయోగాత్మకంగా నభికులకు వివరించారు. చూసినవారు వెలిబుచ్చిన సందేహాలకు సమాధానాలిచ్చారు. అతని కృషిని అందరూ మెచ్చుకున్నారు.

మహారాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా సంస్థ, పంజాబ్ కృషి విద్యాపీఠ్, బెంగుళూరుకు చెందిన అడ్వాంట్ ఇండియా తదితర సంస్థలు విశ్వాస్ తయారు చేసిన సాఫ్ట్‌వేర్ పట్ల ఆసక్తి కనబరిచారు. తమ సిబ్బందికి సాఫ్ట్‌వేర్ వినియోగించుకునే అవకాశం కల్పించమని అభ్యర్థించారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు విశ్వాస్‌మోరే కృషిని అభినందిస్తూ ప్రసంగించారు.

చివరిగా విశ్వాస్‌ను మాట్లాడమన్నారు.

వ్యవసాయానికి సంబంధించి తయారుచేసిన సాఫ్ట్‌వేర్‌కు పేటెంటు హక్కు లభించడం పట్ల అతనికి ఎంతో ఆనందంగా ఉంది. క్రాప్ కంప్యూటరైజేషన్‌పై వివిధ రకాల కోర్సులను ప్రవేశ పెట్టడానికి విశ్వాస్ ఆలోచనలు యూనివర్సిటీకి పనికి వచ్చాయి. ప్రముఖులు చేసిన ఉపన్యాసాల్లో ఇవన్నీ ప్రస్తావనకు రావడంతో విశ్వాస్‌లో ఒకలాంటి ఉద్విగ్నత ఏర్పడింది.

వేదికపై నుంచి తన తండ్రిని ఆహ్వానించాడు. మారుమూల కూర్చున్న జనాబ్ మోరే పంచెను, తలకట్టును సర్దుకుని పైకి లేచి నెమ్మదిగా నడుచుకుని వేదికను ఎక్కాడు.

తండ్రి వేదికపైకి రావడంతో అతని కాళ్ళకు నమస్కరించి పక్కనున్న పూలదండను మెడలో వేశాడు. తర్వాత తన ప్రసంగాన్ని ప్రారంభించాడు.

"నేను... పాఠశాలలో చదువుకోలేదు. నాకు చదువుకోవాలని ఉన్నా నా కుటుంబం అందుకు అవకాశాన్ని కలిగించలేదు. ఆర్థికమైన ఇబ్బందుల కారణంగా చదువుకోలేకపోయాను. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనాన్ని గడుపుతున్న ఈ తండ్రికి అవకాశం లేదు. చిన్నతనం నుంచి నా మనసులో ఇదే విషయం మెదిలేది. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతులకు ఏమైనా చేయాలని అనిపించేది. నా తండ్రి వంటి ఎంతోమంది నిరుపేద రైతులు తమ పిల్లల్ని చదువులకు దూరం చేయడం నా మనసులో గాఢమైన ముద్ర వేసింది."

మాటలను ఆపి విశ్వాస్ కళ్ళు తుడుచుకున్నాడు.

అతని గొంతు తడబడింది.

కళ్ళు చెమ్మగిల్లాయి.

తర్వాత కొనసాగిస్తూ – "రైతుబిడ్డగా నా తండ్రి కోసం నా కృషి కొనసాగించాను. వ్యవసాయంతో ఆత్మహత్యలకు గురికాకుండా ఉండాలన్నది ఆశ. వ్యవసాయం పాడైంది అని ఎవరూ బాధపడకుండా ఉండాలన్నదే నా ఆశయం. నా కోసం నా తండ్రి ఎంతో తపన పడ్డారు. నా తండ్రి వంటి వారి కోసం నేను కృషి చేశాను. నా సాఫ్ట్‌వేర్ నా తండ్రికే అంకితం..." విశ్వాస్ మోరే మాటలు ఆపాడు.

కొండంత ఎత్తు ఎదిగిపోయిన విశ్వాస్‌మోరే వ్యక్తిత్వానికి ముగ్ధుడైన ఆ తండ్రి కొడుకును అక్కున చేర్చుకున్నాడు. సభలో చప్పట్లు మారుమ్రోగాయి.

గిన్నీస్ బుక్ మహాశయా...!

రుక్మిణి

మా శ్రీవారు ఇంట్లోకి అడుగు పెట్టారు. వెనువెంటనే అవాక్కయి దిమ్మెర పోయారు. దానికి రెండు కారణాలున్నాయి.

అందులో ఒకదాని గురించి ముందుగా చెప్పుకోవాలి.

అపుడు రాత్రి పన్నెండు గంటలయింది.

నేను లావోటి, మందపాటి పూలదండ తెచ్చి మెళ్ళో వేశాను. వెండికుందులు, వెండి పళ్ళెంలో వెలిగించి హారతిపట్టి... చప్పట్లు చరిచాను.

పూలు మనింటోవే... బొడ్డు మల్లెలు... పిట్టగోడమీద నుండి పాకి మరీ కష్టపడికోసా... మార్కెట్‌లో కొంటే అయిదార్రూపాయలు ఆముదం అయ్యేది అన్నాను.

"సర్సరే... ఏంటీ వికారం... అసలు సంగతేంటి?" అన్నారు మా శ్రీవారు. కషాయం మింగిన వాడిలా, మొహం చిట్లించినట్లు నటించి కుర్చీలో కూలబడ్డాడు.

అదుగో అపుడే రెండో కారణం. అదేమనగా...

కాళ్ళ ముందు వినయంగా ఒద్దికగా ఒంగి కూర్చున్నాను. ఎదురుగా కూచుని వుంది సాక్షాత్తు తన మెళ్ళో మూడు ముళ్ళు బిగించిన పతిదేవుడేనాయె – అందులోనూ అది అర్ధరాత్రి... అందరూ ముదుచుకుని కలల నిద్దర్లలోకి వెళ్ళిపోతారాయె – ఆ వేళప్పుడు...

శ్రీవారి బూటు లేసులు విప్పాను. భయంకరమైన వాసన కంపుకొడుతున్న సాక్సుల్ని, శ్వాసబంధించి పూడబీకి పదిలంగా భద్రపరిచాను... శ్రీవారు ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"అ..దికాదు... లక్ష్మి... ఇవాళేమో... మా ఆఫీసు యు.డి.సి. లేడూ... వాడూ... వాడే... అహోబిళం గాడూ...

ముసిముసిగా నవ్వా... "అబ్బబ్బబ్బ... ఎపుడూ ఆఫీసే... పోనివ్వండీ...!" అన్నా.

"అది... కా... దు లక్ష్మి... బిళంగాడూ..."

"ఏదీకాదు... రండి భోంచేద్దురుగాని... మటన్ మంచూరియా... చికెన్ సిక్స్‌టీ...

"నో.... నో... నో... బిళంగాడు డిన్నరిచ్చాడు. ప్రమోషను – అదీగాక కోరుకున్న స్థలం.. పూర్‌ఫెలో... నాలుగంకెల్దాకా ఖర్చుపెట్టాడు"

లక్ష్మి మురిపెంగా చిటికెలు విరిచింది. నిన్నకూడా ఇదే విషయం చెప్పారు గదా... బిళంగాడికి రోజూ ప్రమోషన్లా! నిలదీశా...

శ్రీవారి శరీరం ఉక్కులాంటిది. హృదయం పాషాణం వంటిది. మెదడు పాదరసం లాంటిది. ఆలోచన్లు మోసకారివి. మాటల్లో కనికట్టు.... సమ్మోహనకరమైనది.

"అబ్బే... నిన్న చెప్పానా... ఛా... ఛా... ఛా.. అదీ మా యల్డీసీ గంగారామ్... వాడి గురించి... అద్భరెగానీ.... మనం యమర్జంటుగా రేపే ఇయన్టీ స్పెషలిస్టు దగ్గరకు పోవాల. ఎందుకని అడగవేం... హహహ్హా... ఓసారి నీ వినికిడి శక్తిని పరీక్ష చేయించాలి! హహ్హ.."

నవ్వురాకున్నా నన్ను వక్కదారి పట్టించుతున్న శ్రీవారిని చూసి ఇకిలించా – వెంటనే శ్రీవారు దౌటు పడిపోయాడు – పాదరసం బుర్ర కదా!

గబగబ లేచి పాంటూ, చొక్కా విప్పి లుంగీ చుట్టుకున్నాడు. అన్నట్లు కొన్ని అరవ, తెలుగు సిన్మాల్లో డైలాగులా "లక్ష్మీ... అబ్బ... ఇవాళ నువ్వెంత అందంగా వున్నావో.. అబ్బ... వయసు పెరిగే కొద్దీ నీలో అందం గుణకరించి పోతుంది సుమా...!" అన్నారు.

మంచినీళ్ళు మాత్రం సేవించి శ్రీవారు శయ్యపై చేరారు. నేను నవ్వు బ్యాక్‌గ్రౌండులో ఓ విషయం వివరించా...

నిపుణుడైన నేరగాడు సందర్భాన్ని కచ్చితంగా అంచనావేసి అమలు చేస్తాడు. అందుకని రాని చిరునవ్వుని అతికించుకుని, లేని శ్రద్ధను ఒలకబోస్తూ, దిండు కానుకుని వింటున్నాడు.

మీకోసంగతి చెప్పాలి అన్నాను.

"ఏం సంగతి... ఏ విషయం?" తెల్లబోవడం శ్రీవారి వంతు.

"అయ్యో... అదేనండీ... లండన్లో 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' యాభయ్యవ వార్షికోత్సవం బ్రమ్మాండంగా జరుగుతోంది మన తెలుగు సిన్మా ఆడియో రిలీజ్ ఫంక్షనులా...

"అయితే?" శ్రీవారి మనసు ఒకింత ప్రమాదాన్ని శంకించింది.

"అందులో బ్రిటన్‌కే చెందిన క్రిస్‌గ్రీసర్‌ను ఎంచుకుని తమ రికార్డు బుక్‌లో స్థానం కల్పించారు."

"అయితే?" కొద్దిగా బుసకొట్టాడు శ్రీవారు. "బోడిగుండుకూ, బొంబై బీచ్‌కూ సాపత్యం ఏంటి?"

"అదేనండీ – సదరు గ్రీసర్ 7.6 అడుగుల ఎత్తుకు పూటుగా ఎదిగిపోయాడు. పేపర్లో ఫొటో కూడా వేశారు. తలిదండ్రులు ఏం ఎరువువాడారో"

ఈ పాటికి శ్రీవారిలో సహనం చచ్చిపోయింది.

అప్పటిదాకా మురిపెంగా మెడలో వుంచుకున్న బొండు మల్లెల మాలని పరపరా గుంజి చిందరవందరగా చిమ్మేశాడు.

"ఇడియట్!" అర్ధరాత్రేంటీ కొలువు... బుక్కేంటీ... రికార్డులేంటీ... ఇంగ్లాండెందుకూ... ఛీ...ఛీ... నాకు శాంతిని ప్రసాదించు బుద్ధదేవుడా!"

"పూర్కోండి... ఇవేళ మధ్యాహ్నం మనింటో మా ఆడాళ్ళందరం చేరి ఎన్నో సంగతులు మాటాడుకున్నాం! రోజూ అర్ధరేతిరి దాకా క్లబుల వెంటా... బార్ల వెంటా తిరిగొచ్చే పతిదేవుళ్ళ వివరాలు చర్చించుకున్నాం! చాలామందే దొరికారండోయ్. అంత లేటుగా తగలబడీ... అచ్చిరాని అబద్ధాలాడి, భార్య చేతికి చిక్కి చీవాట్లు తినీ.. బూతులు వదిలేవారే ఎక్కువ.

"నోరు మూస్తావా లేదా?" శ్రీవారు ప్రకాష్‌రాజ్ టైపులోకి దిగిపోయారు.

"అయితే మీ అంత అందంగా అబద్ధాలు కల్పించి.. రకరకాల కట్టుకథలల్లి నమ్మించడంలో మీకు మీరేసాటి! అని తీర్మానం. అందుకే మీకు గిన్నీస్ బుక్‌లో స్థానం కల్పించుకున్నా మా మహిళా మండలిలో ఈ వీధిలోని శ్రీవారుల్లో మీదే అగ్రస్థానం అని ఏకగ్రీవంగా తీర్మానించి, దాన్ని ఆమోదించాం! నాకెంత గర్వంగా వుందో తెలుసా! నా పూర్వజన్మ పుణ్యం పుచ్చింది...హాఁ!"

దిండులో మాటామంతీ లేకుండా నిప్పుకోడిలా దూరిపోయాడు. ❖

"మధ్యతరగతో డప్పుట్"

కాలువ మల్లయ్య

"ఈ దేశంల అందరికంటెక్కువ సుఖపడెటోడెవ్వడంటె మధ్యతరగతోడే.. ఈ దేశంలేంది...? ఏ దేశంల నయిన ఇంతేనేమో....?"

రాజమల్లు మాటలకు గంయ్‌మని లేచిండ్రందరు... "భలేటోనివున్నవు రాజమల్లు... నువ్వెంత నువ్వద్ది మాటల చెప్పెటోనివయినా గీ మాటలయితే అవద్ధమే... ఏందేందీ....? మధ్యతరగతోడు సుఖపడ్తండా...? గివ్వేం మాటలు...? ఆడు త్రిశంకు స్వర్గంల కొట్టుక సత్తండు... అటు మీదికీ పోడు... ఇటు కిందికీ రాడు... గిట్ల తండ్లాడుతున్నోన్ని పట్టుకొని మధ్యతరగతోడే మస్తు సుఖపడ్తండంటవేంది...? త్రిశంకు స్వర్గం గూడ సుఖమేనా...?"

దులిపిడిసి పెట్టిండు వెంకటేశం...

ఒగలెనుకొగలు రాజమల్లు మీది కెగవడవట్టిండ్రు... వాళ్ళను పురాగ మాట్లాడనిచ్చిండు రాజమల్లు..

"ఓ మాటన్నందుకు గింతగనం ఉరుకులాడవడ్తిరేంది? మీరంత మధ్య తరగతోల్నాయె ఏటికెనా...? ఏం...? మీరు సుఖపడ్తలేరా ఏంది..?" అన్నాడు రాజమల్లు.

"అంటె...? నువ్వు కాదా మధ్య తరగతోనివి..."

"నేను గూడ మధ్య తరగతోన్నే... గందుకే గీ మాట గింత గట్టిగంటున్న..."

"ఆకుకందక పోకకందక కొట్టుక సత్తాంటె సుఖపడ్తుండంటావ్... గిదో సుఖమా...?" అన్నడు రవికిరణ్

ఇగ గప్పుడు లగాయించి చెప్పవట్టిండు రాజమల్లు..

"పూర్తిగ ఏం లేనోడున్నడనుకుందాం... గీల్లు మన దేశంల కోట్లల్లనే ఉన్నరు గద... గా మనిషి బతుకు, సమయం కడుపునింపే తిండి సంపాయించుకునేటానికే సరిపోతది.. ఇంకో సంగతి గురించి ఆలోచించటానికి యాల్లే ఉండది... ఇగ బాగా పైసలునోల్లున్నరనుకుందాం... డబ్బు... డబ్బు... డబ్బునుకుంటనే ఉంటరు.. గీండ్లనే మునిగి తేలుతరు. గదాన్నింకింత పెంచటానికి కోశిశ్ చేస్తనే ఉంటడు... ఇంకో పన్లేదేం లేదు... గదే... ధ్యాస.. గదే ఆలోచన... గీ మనుషులకు పెండ్లాం పిల్లలతోని గడుపటానికి గూడ సమయముండదు...

ఇగ మనసోంటి మధ్యతరగతోడు ఉన్నడనుకుందాం... తన పని చేసుకుంటడు... కొంత వెసులుబాటు కూడుంటది... పెండ్లాం పిల్లల్తోని కలిసుంటడు... కలిసి తింటడు... ఆదివారం నాడు ఓ సినిమాకు పోతాడు... ఇంతంత మాటనో గిటనో తెచ్చుకొని తింటడు... సోపతి గాళ్ళను కలుసుకుంటడు.... కొంచెమంత ఎంజాయ్ చేస్తడు.. గీ మధ్య తరగతోనికి ఉండవలసిందల్ల తృప్తి.. తురితి పడకుంటనే సంపాయించుకుంటె వాని కంటె సుఖపడెటోడుండడు.. ఇతనికి కొంత సమయం దొరుకుద్ది... పెండ్లాం పిల్లలతోని, స్నేహితులతోని, సుట్టాలు పక్కేలతోని కలిసి ఎంతో కొంత హాయిగా ఉండుట సుఖం గాకేమైతది...? గా అవకాశం మధ్య తరగతోనికే ఎక్కువుంది.

నన్నడుగుతె మధ్య తరగతి కంటె ఎక్కువ ఎదుగుడు దండుగే... ఎందుకంటె అటెనుక సంపాయించినదంత వట్టిగనే ఉంటది గద...! ఎవ్వలకుపయోగ పడకుంట మూల్గుతది గద...! సుఖంగ అన్ని అవసరాలు తీరేటటట్టున్నంక అటెనుక వచ్చేదేం చేసుకోను....? ఏ దేశమయినా, సమాజమయినా అభివృద్ధి చెందింది అన్నరంటె గక్కడ మధ్య తరగతి బాగెదిగిందన్న మాట.. మధ్య తరగతి బాగెదిగితె పై కచ్చినట్టే కద...! ఇటు పూర్తిగ లేనొట్ల అటు విపరీతంగా ఉన్నోల్లుంటె అంతురాలు బాగ పెరిగినట్టే కద...!"

అని అందరి దిక్కు చూడవట్టిండు రాజమల్లు... గా మాటలెంతో ఆలోచింప జేసెటట్టునిపియ్యవట్టినయ్యాల్లకు.. గండ్లెంతో మతులబున్నట్టూ కనవడ్తుంది... కని వాట్ని పురాగ జీర్ణం చేసుకోలేకపోతున్నరాల్లు...

"అంటె...? పైకిపోవద్దా రాజమల్లు...? ఎటూగాక నడుమ ఉగులాడుకుంటనే ఉండమంటవా..? అందరోటంటె నువ్వోటనవడ్తివి..." అన్నడు గంగారెడ్డి..

"పైకి పోవద్దని ఎవల్నన్నరు....? అవకాశమత్తె పైకి పోకుండ ఎవ్వలుంటరు...? కని సంపాదనల గూడ ఓ పద్ధతుండాలె... నీతుండాలె... ఎట్లవడితె గట్టుంటె మంచిదిగాదు... సంపాదనల మానవాంశ పాటించుకుంట ఉన్న అవకాశాలను వాడుకోని మధ్యతరగతికెదుగచ్చు... ఇంకా ఎదుగచ్చు... కని 'ఏమైనా మంచిదే, అన్ని విలువలను నాశినం చేసేసైన మంచిదే, ఏ పద్ధతైన మంచిదే, ఇష్టమున్నట్లు సంపాయించాలె'ననుకునుడే మంచిది గాదు... పైసల్ని, ఆస్తుల్నీ ఒక్క కాడ కుప్పబోసినట్టుంటె గదాంతోని లాభమేంది గవ్వెవ్వలకక్కెర కత్తయి..

మధ్యతరగతి నుంచే చాలా వరకు మేధావులచ్చిండ్రు... రచయితలచ్చిండ్రు... తత్వవేత్తలచ్చిండ్రు... ససంత్ర పోరాటాలప్పుడు గూడ మధ్యతరగతి నుంచి సానమందే మేధావులచ్చిండ్రు... ఉద్యమాలసోంటి వాటికి నాయకత్వం జేసేది గూడ మధ్యతరగతోల్లే.. అయితే ఆండ్ల పని జేసేది మత్తురం ఎక్కువమంది కింది తరగతోల్లే... వాళ్ళకున్న తెగింపు, ధైర్యం మాత్రం మధ్యతరగతోనికుండవు..." అన్నడు రాజమల్లు.

అందరు చెవ్వులప్పగించి వింటండ్రు... కండ్లప్పగించి సూత్తండ్రు... "మధ్య తరగతి ఎక్కో అయినంక కొంత నష్టమైందంటరు... నిజమేనా...?"

"అవు గా మాట నిజమే... వట్టి నష్టం గాద మాభేషుగ నష్టమైంది. కని ఎవ్వలకు...? ఉద్యమాలసోంటి వాటికి... కింది తరగతిలున్నప్పుడు ఉద్యమాలల్లున్నోడు మధ్య తరగతికెదిగినంక వాటికి దూరం జరుగుతండు... ముఖ్యంగ తెలంగాణల గిది గమనించవచ్చు.. మధ్య తరగతి కెదిగినంక ఏదో కొంత భద్రతున్నట్టునిపిత్తదతనికి... ఉద్యమాలల్ల పోతె నష్టమైతదేమోనన్న భయం కల్గుతది.

మధ్యతరగతికెదిగినంక కొన్ని భయాలతోని విలువలు గూడ వత్తయి. విలువలు బతికున్నయంటె గీ మధ్య తరగతి చెయ్యవట్టేనేమో... గీల్లను గొంగలి పురుగులసోంటోల్లన్నా. భాషను, సంస్కృతిని, ఆచారాలను, విలువలను కాపాడేది గీల్లే. ససంత్రం వచ్చినంక మధ్య తరగతి మెల్లిమెల్లిగ ఎదిగినట్లనిపిస్తుంది. అంతకుముందు చదువుకునే అవకాశాలు లేనోల్లకు గూడ కొందరికైన గా అవకాశాలచ్చినయి... దళిత, వెనుకబడిన కులాలోల్లు కూడ కొంత మంది చదువుకొని నౌకర్లు దొరికిచ్చుకొని మధ్యతరగతి కెదిగిండ్రు...

మార్క్స్ సెప్పిన ఎనిమిదిగంటల నిద్ర... ఎనిమిది గంటల పని... ఎనిమిది గంటల వినోదం ఇతర పనులు అనేవి మధ్యతరగతి ఎదుగుడు గురించేనేమో... ఏదో చిన్నదో పెద్దదో నౌకరి దొరికినా, స్థిరమైన ఆదాయమవ్వి ఉన్నా మధ్యతరగతి కెదిగినట్టే కద... గందుకే నేనన్నది మధ్య తరగతి కెదిగిండ్రంటె ఎంతోకొంత సుఖపడ్తున్నట్టేనని... నిజేనికి సుఖపడేది అతడే అనేది వట్టిగన్నది కాదు. గీ మనిషే ఉన్న దాంట్లకెల్లే కొంచెం కొంచెం పోస్టాఫీసులేత్తడు... బేంకు లేసుకుంటడు... పైసాపైసా కూడబెడతడు... ఓ ఇల్లు గట్టుకుంటడు... తనకంటు గూడు నేర్పరచుకుంటడు... కష్టపడి సంపాయించిన ఆస్తికదే... దానిమీద మస్తు ప్రేముంటది... నిజంగ కష్టపడి సంపాయించంట్ల ఎంతానందముంది...? గందుకోసం అందరు మధ్యతరగతి కెదిగెటట్టు పథకాలుండాలె..."

రాజమల్లు దిక్కు అందరు ఆశ్చర్యంగ సూత్తండ్రు... సాననేపటిదాక ఎవ్వల నోట్లె నుంచి గూడ ఒక్కమాట గూడ రాలే...

"బాగ సెప్పినవే రాజమల్లన్న...! నువ్వు సెప్పిన సంగతులల్ల అగ్గసోంటి నిజేలున్నయి... కని గా నడిమి తరగతి గిప్పుడు పెద్ద ప్రమాదంల పడ్డట్టనిపిత్తందే...." అన్నడు వెంకటేశం...

త్రిశంకు వర్గం ప్రమాదంల పడ్డది... గీల్లంత కిందికి పొయ్యేటట్టున్నరు... కిందోల్లు ఇంకింత కిందికి పోతరు గద... ప్రైవేటును ఇష్టమున్నట్టు రప్పించుడంటెనే గిది... అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతయి.. కాని చిన్న ఇన్వెస్టర్ల మిత్తి తగ్గుతది... ప్రైవేట్ల దబ్బేత్తి గది వత్తదన్న నమ్మకం లేదు... వస్తువుల మీద ప్రేమ పెంచుతరు. రంగురంగుల సూపిత్తరు. ఉన్నదంత దానికే పోత్తరీల్లు... వట్టిగ డబ్బొచ్చే బ్రోకరిజాన్ని పెద్దగచేసి చూపుతారు. వీళ్ళ ఏండ్ల కష్టార్జితం వెలవెల బోతది... గిట్లు ఎన్నో జరుగుతున్నాయి. అయితే గిదొంకందుకు మంచిదేనేమో.. గిదిం తోని గీ గొంగలి పురుగులల్లున్న స్తబ్దత పోతదేమో... వాళ్ళ ఖ్నన భ్రమలు దూరమైతయేమొ?" అన్నడు రాజమల్లు.

చక్కటి ఆరోగ్యానికి కలబంద

మూడు వందల రకాలు కలిగిన కలబందలో “లిల్లీ” జాతికి చెందిన గొప్ప ఔషధ గుణాలు కలిగిన ‘బార్బెడెన్సిస్ మిల్లర్’ అనే మొక్క అతి ముఖ్యమైనది. ఇది ఉష్ణ రాష్ట్రాలలో పెరుగుతుంది. ప్రకృతి ప్రసాదించిన ఈ కలబంద శరీర ఆరోగ్యానికి, గాయాలను మాన్పడానికి, చర్మ రోగాలను నివారించడానికి, చర్మ సౌందర్యానికి వినియోగించినట్లు ఎన్నో శతాబ్దాల చరిత్ర తెలియజేస్తోంది. దీనిని పర్షియా (నేటి ఇరాన్), ఈజిప్టులు, గ్రీక్, ఇటలీ, ఇండియా, ఆఫ్రికా దేశాల వారు చాలా పురాతన కాలం నుండి ఉపయోగిస్తున్నారని చరిత్ర చెబుతుంది.

– సీతాదేవి తన సౌందర్యాన్ని పెంపొందించుకోవడానికి కొంతకాలం కలబంద వనాల్లో ఉన్నట్లుగా రామాయణంలో వివరించబడింది. పురాతన ఆయుర్వేద గ్రంథాల్లో కలబంద వైద్యం గురించి గొప్పగా రాయబడింది. అధర్వణవేదంలో అలోవెరాను సైలెంట్ హీలర్ అని పేర్కొనబడింది.

– కొలంబస్, మార్కోపోలో తమ తమ యాత్రలలో “అలోవెరా” గురించి కొనియాడుతూ వివిధ దేశాలలో అనేక రుగ్మతలకు దీనిని ఉపయోగిస్తున్నట్లు వివరించారు.

– నాల్గవ శతాబ్దం అలెగ్జాండర్ చక్రవర్తి యుద్ధంలో తమ సైనికులకు గాయాలు మాన్పడానికి, వారికి శక్తిని సమకూర్చడానికి ఔషధంగా వాడినాడు. అంతేకాదు. ఈ కలబంద మొలకలకై ఏకంగా ఈజిప్టు దేశంతో ఒక యుద్ధమే చేశారట.

– ఈజిప్టు రాణి క్లియోపాత్రా తన చర్మాన్ని మృదువుగా, అందంగా ఉండుటకు కలబందను వాడినట్లు చరిత్ర చెబుతోంది.

– ప్రాచీన చైనీయులు దీనిని చర్మవ్యాధులకు వినియోగించేవారు.

– గ్రామీణ ప్రాంతాలలో చేలగట్లపై, బంజరు భూములలో, వాగులు వంకలలో పెరిగే మొక్కగా కలబంద అందరికీ తెలుసు. ఇంగ్లీషులో దీనిని అలోవెరా అని, సంస్కృతంలో కుమారి, ఘృతకుమారి, దీర్ఘపత్రికా, స్థూలదళ, గృహకన్యా వంటి అనేక పేర్లతో పిలుస్తారు. కలబందలో ఔషధీయ లక్షణాలు వున్నాయని పూర్వకాలం నుంచి తెలిసినా గ్రామీణ ప్రాంతాలలో పనికిరాని మొక్కగానే పరిగణిస్తున్నారు. కాని ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ప్రకృతి సిద్ధ ఔషధాలపై ఆసక్తి వలన కలబందలో వున్న అపారమైన ఔషధీయ లక్షణాల ఆధారంగా ఎన్నో రకాల ఔషధ, చర్మ రక్షణ, సౌందర్య పరిరక్షణ ఉత్పత్తులను తయారు చేయడానికి కృషి చేసి సఫలీకృతులయ్యారు మన శాస్త్రవేత్తలు.

వివిధ పరిశోధనా ఫలితాలు

కలబందపై జరిగిన వివిధ పరిశోధనల ఫలితాలు 21వ శతాబ్దం శక్తివంతమైన ఔషధ మొక్కగా గుర్తించే విధంగా చేశాయి.

అలోవెరా గాయాలను శుభ్రపరిచే పాలీన్ ఆక్సైడ్ జెల్‌తో కలిపి శుభ్రపరిస్తే 72 గంటల ముందుగా ముఖంపై ఏర్పడిన గాయం మానింది. నరాల సర్జన్ అయిన డాక్టర్ టైర్ ‘అలోవెరా’ వల్ల మధుమేహ వ్యాధితో బాధపడుతున్న ఒక మహిళ చేతిని కోల్పోకుండా చేయలిగాను” అంటున్నారు. ఈయన బాస్సిర్ మెడికల్ సెంటర్, లూసియానాలో వాస్కులర్ సర్జన్‌గా పని చేశారు. ఫేషియల్ సర్జరీలో అలోవెరా అద్భుత ఫలితాలు ఇస్తుందని పరిశోధనలు రుజువు చేశాయి.

అలోవెరా 99 శాతం నీటిని కలిగి వున్నా కూడా అది న్యూట్రిట్స్ స్టోర్ హౌస్ అని చెప్పవచ్చు. దానిలో ఉండే 200లకు పైగా చురుకైన మూలకాలు మానవ శరీర ఆరోగ్యానికి సహాయ పడతాయి. సోరియాసిస్ వ్యాధి గ్రస్తులు అలోవెరా క్రీమును బాధకలిగించే చోట వాడినట్లయితే ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని రుజువైంది. వివిధ రకాలైన

250 శారీరక గాయాలపై, మధుమేహ వ్యాధిగ్రస్తుల గాయాలతో కలిపి నాణ్యమైన అలోవెరా జెల్‌పూత ద్వారా నూరుశాతం గాయాలు నివారణ పొందవచ్చునని రుజువు చేశారు.

సర్వరోగ నివారిణి అలోవెరా

అలోవిరా అనేక రోగాలు, వ్యాధులు, నొప్పులు, వ్యాధి నిరోధక ప్రక్రియకు తోడ్పడుతూ ఉపశమనం కలుగజేస్తూ ప్రపంచంలో 170కి పైగా దేశాలలో అన్ని వయస్సుల వారి విశ్వాసాన్ని చూరగొన్న ప్రకృతి ప్రసాదించిన మంచి ఆహార అనుబంధం. రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా కలుషిత వాతావరణానికి దూరంగా వేల ఎకరాలలో ప్రకృతి మధ్య సేంద్రీయ ఎరువులతో పెంచే అలోవెరా మొక్కల యందు సగటు ఔషధ గుణాలు పరిపూర్ణ స్థాయికి రావడానికి 2-3 సం॥కాల వ్యవధి పడుతుంది. ప్రత్యేక శ్రద్ధతో వీటిని గుర్తించి, వేరుచేసి, శుభ్రపరిచి వాటి నుండి గుజ్జును వేరు చేసి స్టెబిలైజేషన్ ప్రక్రియ ద్వారా వాటిలోని పోషక, ఔషధ విలువలను భద్రపరిచి, అన్ని దేశాలలో ఆమోద ముద్ర పొంది నేడు భారతదేశంలో ప్రవేశించింది.

రోగాలకు మూలం జీర్ణవ్యవస్థ

నేడు మనకు గల అనేక రోగాలు, నొప్పులు, బాధలకు 90% కారణం మన జీర్ణవ్యవస్థ. సరిగ్గా జీర్ణం చేయకపోవడం, ఆహారంలో పోషక విలువలు పూర్తిగా గ్రహించ లేక పోవడం వల్లనేనని పరిశోధకుల అభిప్రాయం.

పుట్టినప్పుడు మానవుడు జీర్ణ వ్యవస్థ పరిశుభ్రంగా, రోగ నిరోధక శక్తితో నిర్మించబడి ఉంటుంది. తల్లిపాలతో రోగనిరోధక శక్తి వృద్ధి చెందుతుంది. కాలక్రమేణా మనం పీల్చే గాలి , త్రాగే నీరులోని రసాయన వ్యర్థ పదార్థాలు, పొగ తాగడం, పీల్చడం వల్ల అధిక పరిమాణంలో కొవ్వు పదార్థాలు తినడం వల్ల, అధిక ఒత్తిడులు, ఆహారంలో నిల్వ ఉంచే పూదార్థాలు ఉపయోగించడం వల్ల మన అన్నకోశం, ప్రేగుల యందు వ్యర్థ పదార్థాలు పెరుగుతాయి. ఇవి





మన జీర్ణ కోశాన్ని నాశనం చేయడం వల్ల మన శరీరం తేలికగా రోగాలకు నిలయమైపోతుంది. కావున మనం తీసుకునే అనేక రకాల ఫలాలు/ కూరగాయలు మాంసాహారంలోని విటమిన్‌లు, పోషక విలువలు, మన శరీరం పూర్తిగా జీర్ణించి గ్రహించుకోలేక పోవడం చేత అధిక శాతం పోషక విలువలు వృథాగా పోతాయి.

అలోవెరా ఎలా పనిచేస్తుంది?

జీర్ణ వ్యవస్థ నందు పేరుకుపోయిన (వ్యర్థ, విష పదార్థాలు)ను తన ప్రకృతి సామర్థ్యంతో సడలించి నెమ్మదిగా విసర్జించుట ద్వారా ఆహారం నందు గల పోషక విలువలను గ్రహింప చేసి శరీరానికి మేలు చేస్తుంది. అలోవెరా నందు గల అన్వయ గుణం వల్ల ప్రతి వారికి తగినట్లుగా పనిచేయుటచే ఫలితాలు వేరుగా ఉంటాయి. అంటే జీవరాసులన్నింటికీ కణం ప్రాథమిక ప్రమాణం. జీవరాశులన్నీ కణాలతో నిర్మాణమై ఉన్నది. మన శరీరం 10 ట్రిలియన్ కణముల కన్న ఎక్కువ కణముల చేత నిర్మించబడింది. అలోవెరా రోగ లక్షణముల మీద పనిచేయకుంటే దానిని కలుగజేయు కణదశ నుంచి పనిచేయును. ప్రొటీన్స్‌ను నిర్మించుటలో అమినో యాసిడ్స్ ముఖ్యపాత్ర వహిస్తాయి. మన శరీర మందలి ప్రతి కండరం/ నరాలు/ ధాతువులు/ అనేకమైన అమినో యాసిడ్స్ యొక్క మిశ్రమం వల్ల ఏర్పడును. ఇంత ప్రాముఖ్యమైన 22 రకాల అమినో యాసిడ్స్ మన శరీరానికి కావాలి.

మన శరీరానికి ఆవశ్యకమైన 8 అమినో ఆమ్లాలను, సి1, బి12 విటమిన్‌లను స్వతహాగా శరీరం ఉత్పత్తి చేయలేదు. కావున, వీటి కోసం మనం ప్రకృతి మీద ఆధారపడాలి. ప్రకృతి ప్రసాదించిన ఈ కలబంద నందు 18 రకాల అమినో ఆమ్లములు లభ్యమగును. వీటిలో మనకు ఆవశ్యకమైన 8 అమినో ఆమ్లంలతోపాటు ఇతర యాసిడ్స్, ఖనిజములు, ఎ, బి1, బి2, బి3, బి5, బి6, బి12, సి, డి, ఇ విటమిన్‌లు ఉండుట వల్ల మన శరీరానికి మంచి ఆహార అనుబంధంగా పనిచేయును.

ఎన్ని ఉపయోగాలో!!

రోజుకి కాస్తంత 'అలో' చేస్తుంది మేలు కొండంత

1) కీళ్ల నొప్పులు, మధుమేహం (సుగరు), కండరాల నొప్పులు, కొలెస్ట్రాల్, గుండెపోటు, మలబద్ధకం, క్యాన్సర్ గడ్డలు, అధిక రక్తపోటు, క్షయ, కిడ్నీ సమస్యలు, కాలేయ సమస్యలు, కడుపులో మంట (ఎసిడిటి), రక్తహీనత, ఆస్తమా, అర్షమొలలు, స్త్రీల బహిస్టు సమస్యలు, పంటి నుండి రక్తం కారుట, నిద్రలేమి, రక్తం గడ్డ కట్టుట, అధిక బరువు సమస్యలకు చక్కటి పరిష్కారం.

2) కాలేయ సంబంధ వ్యాధులపై ప్రతిక్రియ చూపును.

3) పొట్టలో వచ్చే అల్సర్ల వంటి రోగాలు ఏర్పడకుండా పనిచేయును.

4) కణుతుల ఎదుగుదలను అరికట్టును లేదా నెమ్మది చేయును లేదా వాటిని సంకోచింపచేయు సామర్థ్యం గలది ఈ కలబందం.

5) చర్మాన్ని మృధువుగా చేయును. మొటిమలు, మడతలు పడడుట తగ్గించును తామర, గజ్జి, దురద, కాలిన, తెగిన గాయాలకు, అనేక చర్మ బాధలకు గొప్ప ఉపకారి. ఇలా ఎన్నో రకాల దీర్ఘకాలిక సమస్యలకు చక్కని ఉపశమనం.

గ్రామీణ ప్రాంతాలలో పెరిగే కలబంద మొక్కకు సుదీర్ఘ చారిత్రక నేపథ్య ఉంది. ఎన్నో ఔషధ విలువలున్న కలబంద శతాబ్దాలుగా వైద్య సేవలందిస్తోంది. ఇటీవల కాలంలోనే ఇది అలోవెరాగా ప్రాచుర్యం పొందింది.

శాస్త్రవేత్తలు అలోవెరాను అనునిత్యం ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన పానీయంగా రికమండ్ చేస్తున్నారు. ప్రొటీన్స్, కాల్షియం, మెగ్నీషియం, జింక్, ఎ, సి, ఇ విటమిన్లు, విటమిన్ బి-కాంప్లెక్స్, ఇతర అత్యావశ్యక కొవ్వు పదార్థాలు కలిగి ఉండడం వల్ల అలోవెరా ఒక సమగ్ర ఔషధంగా గుర్తింపు పొందింది. అలోవెరా మానవ జీర్ణవ్యవస్థపై శక్తివంతంగా పనిచేసి వ్యాధులను దూరం చేస్తుంది. అందువల్ల ప్రతి రోజూ ఆహారానికి ముందు అలోవెరా జ్యూస్ తాగడం ద్వారా దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉండవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు.

1997లో శాన్ ఆంటోనియా విశ్వవిద్యాలయం పరిశోధకుడు జెరెమై హెర్లీ నిర్వహించిన పరిశోధనలో ప్రతి రోజూ అలోవెరాను తీసుకోవడం వల్ల ఎటువంటి హానీ జరగకపోగా, రక్తహీనత, గుండెజబ్బులు, కిడ్నీ జబ్బుల నుంచి నివారణ పొందవచ్చునని తెలిపారు. అంతేకాకుండా అలోవెరా మానవుని జీవితకాలాన్ని కూడా పెంచుతుందని తన పరిశోధనలో గుర్తించారు.

వివిధ రకాలైన వాయిద్య పరికరాలు శ్రావ్యమైన సంగీతాన్ని సృష్టించినట్లుగా అలోవెరాలో ఉండే 15 రకాల పోషకాలు కలిసి పనిచేస్తూ మానవులకు శక్తిని ప్రసాదిస్తున్నాయి.

అందువల్లనే ఇది సమర్థవంతమైన, ఆరోగ్యప్రదమైన, ఔషధ మొక్కగా ఏర్పడింది అంటారు ఎండోక్రెనాలజిస్టు, బయోలజిస్టు పరిశోధకుడైన రాబర్ట్ జెనిస్.

బతుకు అలజడుల "దాఖలా"

చిక్కని కవిత్వం అందరికీ అంత తేలిగ్గా అంటదు. కానీ వర్ఝుల శివకుమార్ కవితల్లోని అక్షరాలు, వాటి వెనుకనున్న ఒక విధమైన అలజడి మనల్ని చదివింపజేస్తుంది. ఈ కవి తెలంగాణా నిప్పులసెగమీది కవి.

అనుక్షణం పొడసూపుతున్న వైరుధ్యాలకు
నేను 'దాఖలా'లు ప్రవేశపెట్టలేను
...అంటూనే కవి శివకుమార్
ప్రతి అభియోగానికో దాఖలా
ప్రతి సందేహానికో దాఖలా
ప్రతి భయానికో దాఖలా

చూపించే ప్రయత్నమే ఈ "దాఖలా" కవితాసంకలనం. "**ఇప్పుడు గూట్లో రూపాయి లేకున్నా / మొగుడు సిపాయి కావొచ్చు/ అలకల్ని కలతల్ని తుడిచేసి తడిచేసే/ అనుబంధాల ఇంధనం దొరికింది**" అంటూ మనల్ని మన అప్పు బతుకుల దాఖలాలు ఎన్నింటినో చూపుతారు. ఋణానందలహరి అనే ఆ కవితలో "**ఇల్లు కావాలా సంతకం పెట్టు/ రేపే నీ ఇంట్లోకి నువు కిరాయికి దిగిపో/ పొదుపుకి తెరదించెయ్/ అదుపులేని కోరికలను కొండెక్కనియ్...**" అంటూ నేడు రకరకాల పేర్లతో జరుగుతున్న హౌస్ లోన్స్ ఫెస్టివల్స్, బొనాంజాలు, ఋణమేళాలు వినిపించారు. అవి నిర్మిస్తున్న మధ్యతరగతి భ్రమాత్మక సౌధాలను కవిత్వీకరించారు. "**ఎవడో వలవేయాల్సిన పనిలేదు/ ఋలిపించే వలల్ని/ బుద్ధిపూర్వకంగా వలచే కాలం ఇది**" అంటూ నేటి వస్తువ్యామోహ సంస్కృతిని, దాని ప్రమాదాన్ని చూపుతారు. "**కమాన్ డయల్ చెయ్/ ప్రపంచం నీ గుప్పిట్లో/ మరి నువ్వెవరి గుప్పిట్లో???**" అని ప్రశ్నాపూర్వక వ్యక్తీకరణలోంచి ప్రపంచ మార్కెట్ ప్రవాహ ఉరవడిని, దాని వరదముంపుని అక్షరీకరించారు వర్ఝుల కవి. "దాఖలా" కవితా సంకలనంలోని ఈ మొదటి కవితావిశేషంలోంచి మొత్తం తాను చూపబోయే కవితా దాఖలాలకు తన పాఠకుల్ని సిద్ధం చేసుకుంటాడు.

ఇంతటి ప్రపంచీకరణ ప్రమాదం ఇప్పుడు నల్లేరు మీది బండి నడకలా సాగడానికి కారణం వ్యతిరేకించే, నిరోధించే మనసులు, మనుషులూ లేకుండా చేసుకోగలగటమే. ఆ విషయంలో ప్రపంచ షావుకారు (తాత్కాలికంగా)విజయవంతంగా చెలాయించుకొస్తున్నాడు. దీన్ని ఎదుర్కోవడానికి ఉద్యమాలు బాహ్యకారకాలను మార్చే పెనుయుద్ధాన్ని సన్నద్ధం చేస్తున్నారు. ఈ కవి వ్యక్తి అంతర్గత కారకాలపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నాడు. "**ఇప్పుడు శత్రువూనువ్వే/ శత్రుస్థావరమూ నువ్వే/ ...ఇప్పుడు ధ్వంసం కావలసింది/ బయటకాదు లోపల/ నిర్మాణం జరగాల్సిందీ లోపలే**" అనంటారు. సామూహిక చేతనకు వ్యక్తి చేతనకూడా అవసరమే. కానీ ఈ రెండూ సమన్వయించి, జతకట్టి సాగితే విస్ఫోటనమే.

ఆ ప్రయత్నం "కోటొక్క చేతుల కొట్లాట" కవితలో చేస్తారు. "**మాకు మా బూమ్మీద లావు ఆపేచ్చ....అచ్చు గట్టిచ్చి ఇదుగిరువాల్లున్ని/ పిడికెడు కలలు జల్లితే/ పొదిగి నిజం చేసింది**" అని ఈ కవి తను పుట్టిపెరిగిన భూమితల్లిని తనదైన యాస భాషలో ఆవిష్కరిస్తున్నాడు. "**బూమి నా కడపలోకి అడుగు వెట్టిన/ అయిరాండ్ల(అయిరేణి) కుండ/ పుదిచ్చిన బోనం/ మా అల్కిన వాకిట్ల ముగ్గు/ మా కంచుట్ల ముద్ద**". అలా తియ్యని తెలంగాణా మాండలిక మాలలతో తన ఇంటి గడ్డను అలంకరించిన విధం అందరినీ అలరిస్తుంది. "**తీరొక్క దుర్మార్గాలమీద/ ఇంక తిర్గవడితే తప్ప గతిలేదు మాకు/ గందుకే మా బూమికి మేమే నోర్రైతున్నం/ కోటొక్క చేతుల కొట్లాట షురూ జేసినం**". ఈ కవిత, కవి పుట్టిపొర్లాడిన మట్టి ఆనవాళ్ళు పట్టిస్తుంది. తనలోంచి, తన స్వ లోంచి సమిష్టి చేతనకు చలనం కన్పిస్తుంది. అయితే ఈ కవిత రాసిన, ప్రచురించిన కాలంయొక్క నేపథ్యంలో చూస్తే..."**మాచెర్లకు గండ్లు కొట్టి**", "**ఇప్పుడు మా పెయ్యంత కాల్వల వాతలే**" "**నీడనిచ్చినందుకు దగా చేసి**" లాంటి భావాల వల్ల 'కోస్తా ప్రాంతీయ' వలసవాదం పేరుతో వచ్చిన కొన్ని వాదనలకు కవి గురయ్యాడా అని అనిపిస్తుంది. బ్రిటిష్‌వాడి పథకమైన అసమాన అభివృద్ధి తంత్రాన్ని, దాని ఫలితమైన అస్తవ్యస్థ నీటిపారుదల పథకాన్ని కవి అర్థంచేసుకోలేదనిపిస్తుంది.



దాఖలా
(కవితాసంకలనం)
కవి:వర్ఝుల శివకుమార్,
ప్రచురణ: పొయిట్రీ ఫోరమ్, హైదరాబాద్, **పేజీలు:**104,
వెల:రూ. 50/-,
కాపీలకు:ప్రజాశక్తి, విశాలాంధ్ర, నవోదయ, దిశ, తదితర బుక్‌హౌస్‌లు.

ఇక్కడికీ వలసొచ్చి దోపిడీ చేసే శక్తులు ఆ ప్రాంతాలలోనూ దోపిడీదారులే అవుతారనే వర్గవిశ్లేషణ పట్ల ఏమరుపాటు పడ్డాడనిపిస్తుంది. కానీ "**వైరుధ్యాల అంచుల మీద**" అనే కవితను చదివితే ఆ అనుమానానికి తావులేదనిపిస్తుంది. "**వాడు విజయం సాధిస్తున్నాడు/ మన బలహీనతల మీద/ మన వెంపర్లాటల మీద/ మన గుర్తింపు తాపత్రయాల మీద/ మన లొంగుబాటుల స్వర్గాల మీద/ వాడు విజయం సాధిస్తున్నాడు**"..."**వాడు రెండు నాల్కల పాచికలేసి/ మన విరోధానికి ఆజ్యం పోస్తుంటాడు**". ఈ కవితద్వారా ప్రాంతీయవాదాల మాటున ఉన్న అనైక్యతాప్రమాదాలను, పాలకవర్గాల ప్రయోజనాలను కవిత్వీకరించారు.

"**నిన్న శిలువ మేకులమ్మిందీ/ ఇప్పుడు ఆయుధా అమ్ముతున్నదీ...**" ఆ అమెరికావాడేనని ప్రపంచడాలర్ డ్రాక్యులాను కవిత్వవీధుల రచ్చబండనెక్కించాడు. "**అరే! సైతాన్ నీ క్రౌర్య ప్రతిబింబాన్ని/ చమురు పొగచూరిన ఆకాశంలో చూసుకో/ ఈ కళేబరాల పంటంతా నీదే**" నంటూ ఇరాకు నేలన అమెరికా అకృత్యాలకు నేరవిచారణ చేశారు. మతోన్మాదం, సామ్రాజ్యవాదం కలగలసి ఊరేగుతున్న దుష్టముహూర్తపు రోజులివి. "**మళ్లీ పావురాలు రాలిపడుతున్న సందర్భం**" గా గుజరాత్ మారణకాండకు చలించిన తన అక్షరాశ్రువులను "అమానవీయం" కవితగా గడ్డకట్టించారు. "**రాళ్ళను గుళ్ళుచేసి ఊరేగిస్తున్న వాళ్ళు/ మనుషులుండే నేలను వల్లకాడెందుకు చేస్తున్నారు**" అని గుజరాత్ వెళ్ళిన కవులందరి తరఫున ప్రశ్నించారు.

ఇలాంటి ఎన్నో గాఢమైన భావనలకు కవిత్వ రూపమిచ్చారు. అందమైన ప్రచురణగా మన ముందుంచారు. ఎంతో చిక్కటి కవిత్వంతో, బిగువైన కవితానిర్మాణ కౌశలంతో రాసిన వర్ఝుల కవిత్వ 'దాఖలా' అర్థమవ్వాలంటే పాఠకులు 'ఏడుగుర్రాల పొద్దుమీద ఆగమాగపు దౌడు' అవ్వాల్సిందే. కవిత్వానికి చెందిన అవగాహనలను గుర్రాల్లా పూన్చుకోవాల్సిందేననిపిస్తుంది.

- శంకర్

స్వీకారం



అభివృద్ధిలో ఆదివాసీలు?
రచన : పల్లా త్రినాథరావు; వెల:రు. 50/-;
ప్రతులకు: లయ, ప్లాట్ నెం. 501, కురుపం కాసిల్, ఈస్టు పాయింట్ కాలనీ, విశాఖపట్నం-530 017.

సంకలనాలై పుష్పించండి
రచన : సజ్జా వెంకటేశ్వర్లు; వెల:రు. 10/-;
ప్రతులకు : కవి, జయలక్ష్మి టాకీస్ దగ్గర, వేటపాలెం, ప్రకాశం జిల్లా – 523187

హృదయాలను రంజింప చేసే పింజరికొండ అందాలు



చల్లా విశ్వనాథం

తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి సహజంగా ఏర్పడిన అనేక సుందర స్థలాలు న్నాయి. వీటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో పాలకులు విఫల మయ్యారు. జిల్లాలో సుమారు 4191.65 చదరపు కిలోమీటర్ల పరిధిలో అటవీప్రాంతం విస్తరించి వుంది. ఈ అటవీప్రాంతానికి తూర్పున విశాఖ జిల్లా, పశ్చిమాన గోదావరి నది, ఉత్తరాన ఒరిస్సా సరిహద్దు ఉన్నాయి. ఈ గిరిజన ప్రాంతం ఎటుచూసినా అందాలను విరజిమ్ముతూనే వుంటుంది. పచ్చనిచెట్లు, దట్టమైన అడవులు, ఆకాశాన్ని తాకుతూ ఎత్తయిన శిఖరాలు, పాతాళాన్ని మరిపించే లోయలు, అందాలను ఒలకబోసే జలపాతాలు, గలగల పారే సెలయేర్లతో నిండి వుంది. నిత్య సొగసులకు ఆలవాలమైన ఈ ఏజెన్సీ ప్రాంతమంతా గిరిజనుల హృదయాలకు మల్లే స్వచ్ఛమైన, నిర్మలమైన అందాలతో విరాజిల్లుతోంది. అటువంటి అందాలతో కళకళలాడే ఏజెన్సీలో అనేక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పర్చేందుకు వీలున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. వీటిలో అడ్డతీగల సమీపంలోని 'పింజరికొండ జలపాతం' చూడదగ్గ ప్రదేశాల్లో ఒకటి.

కాకినాడకు 90 కిలోమీటర్లు, రాజమండ్రికి 80 కిలోమీటర్ల దూరంలో ఈ పింజరికొండ జలపాతం వుంది సామర్లకోట రైల్వేస్టేషన్‌కు సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాకినాడ, రాజమండ్రి, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేటల నుండి ప్రతీ గంటకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. ఏలేశ్వరం ఏలేరు ప్రాజెక్టు దాటిన వెంటనే ప్రారంభమయ్యే అటవీప్రాంతంలో గిరిజన గ్రామాల మీదుగా ప్రయాణం కొనసాగుతుంది. రాయవరం, రమణయ్యపేట, గొంటువానిపాలెం, జె.అన్నవరం, తిమ్మాపురం, బొంగరాలపాడు, మట్లపాడు, నాయుడుపాకలు, ఎల్లవరం, పాపంపేట, భీముడుపాక, చివరగా అడ్డతీగెల గ్రామాలున్నాయి. అయితే స్వంతవాహనం వున్నవారు అడ్డతీగెల వరకు వెళ్ళకుండా పాపంపేట నుంచి మట్టిరోడ్డు గుండా 'పింజరికొండ' చేరుకోవచ్చు. అడ్డతీగెల వరకు బస్సులో వెడితే అక్కడి నుంచి ఆటోలపై పింజరికొండ జలపాతం చేరుకోవచ్చు. ఈ ప్రయాణంలో ఏలేశ్వరం దాటిన తర్వాత ప్రారంభమయ్యే అటవీ ప్రాంతంలో పచ్చనిచెట్లు, పెద్దపెద్ద లోయలు, జలపాతాలు, సెలయేళ్ళు, పక్షుల కిలకిలారావాలు దారి పొడవునా పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి.

అంతులేని అందాలు - అవధులు లేని ఆనందాలు

ఎత్తయిన దుమ్ముకొండ లోయల్లోంచి ఎన్నో మైళ్ళదూరం ప్రవహించే సెలయేరు పింజరికొండ వద్ద ఉత్తరం నుండి దక్షిణానికి ప్రవహిస్తూ తూర్పు దిశకు మళ్ళుతుంది. దారి మళ్ళిన ప్రవాహం బండరాళ్ళను వొరుసుకుంటూ జలపాతమై ఉరుకుతోంది. ఈ సెలయేటికి అవతలి పక్క పింజరికొండ గ్రామ పంచాయతీ వుంది.



సెలయేటి మడుగులో శివాలయం

ఈ పింజరి కొండ ప్రకృతి అందాలుగానే కాకుండా నీటి మడుగులో వున్న శివాలయం వల్ల ప్రాచుర్యం పొందింది. కొండల దిగువన వందలాది సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయం, శివలింగం ఉండేవని అందరూ చెపుతుంటారు. ఈ ఆలయం ప్రక్కనుండి సెలయేరు ప్రవహించేదని, ఈ శివాలయంలో నిత్యపూజలు జరిగేవని, శివరాత్రికి రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుకుంటూ గిరిజన సంప్రదాయ నృత్యగానాలతో తెల్లవార్లూ జాగరణ చేసేవారని తమ పెద్దలు చెప్పినట్టు అక్కడి గిరిజనులు చెబుతుంటారు. కాలగమనంలో ప్రవాహ ఉధృతికి ఈ సెలయేరు ప్రవాహదారి గాడితప్పి కొండ దిగువన వున్న శివాలయం మీదుగా ప్రవహించడం వల్లనే ప్రస్తుతం శివాలయం నీటి మడుగులో వుందని భావిస్తున్నారు.

నేటికీ మహాశివరాత్రి ఉత్సవాలు

ఆ ప్రాంత గిరిజనులు నేటికీ మహాశివరాత్రికి రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుపుతున్నారు. వేలాదిమంది గిరిజనులు హాజరవు తారు. వేలాదిమంది గిరిజనులు హాజరయ్యే ఈ ఉత్సవాల్లో నేడు గిరిజన సంప్రదాయ బద్ధమైన కళారూపాలు, నృత్యాలు, పాటలకు బదులు వీధి సినిమాలు, రికార్డింగ్ డ్యాన్సులు మాత్రమే ప్రదర్శించ బడుతున్నాయి. ప్రతీ ఆదివారం, సెలవు దినాల్లో వందలాది మంది పర్యాటకులు ఈ పింజరి కొండకు వస్తుంటారు. కార్తీకమాసం నెల రోజులూ ఈ 'పింజరికొండ' యాత్రికులతో కళకళ లాడుతుంది. కొండలు, దట్టమైన చెట్లు, సెలయేటి గలగల సంగీత రవళుల మధ్య పింజరికొండ సుందర దృశ్యాలు పర్యాటకుల హృదయాలను పరవశింప చేస్తాయి. ఈ రమణీయ అందాలు అనేక సినిమాలకు కూడా దృశ్యమాలికలయ్యాయి. ❖



"నాటక ప్రక్రియ సర్వశ్రేష్టమైంది"

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డిగ్రీ, స్నాతకోత్తర స్థాయిలలో ఆంధ్రోపన్యాసకులుగా, ఆంధ్రాచార్యులుగా దిగ్విజయంగా విధులు నిర్వహించి, పదవీ విరమణ పొందిన వ్యక్తి ఆయన. 1997-2000 మధ్యన 'తెలుగు నాటకం-సామాజిక చైతన్యం' అనే శీర్షికన యు.జి.సి. మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టుగా మంచి సిద్ధాంత వ్యాసాన్ని ఇంగ్లీషు, తెలుగు భాషల్లో వేర్వేరుగా 200 పుటలుగా రచించిన సాహితీకారుడు. ఆయన తన పర్యవేక్షణలో 27 పిహెచ్.డి.లు, 20 ఎం.ఫిల్ డిగ్రీలు పొందటానికి సారథ్యం వహించిన మార్గదర్శి. వివిధ సాహితీ ప్రక్రియలపై 67 గ్రంథాలు ప్రకటించిన గ్రంథకర్త. "కోలాచలం శ్రీనివాసరావు నాటక సాహిత్య సమాలోచన" అనే అంశాన్ని ఎంచుకుని పిహెచ్.డి సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించిన పరిశోధకుడు. ఆయన ఎవరో కాదు ఆచార్య ఎస్.గంగప్ప. నాటక సాహిత్యంలో విశేష కృషి చేసిన ఆయనతో పి.ఎం.సుందరరావు జరిపిన సంభాషణ ఇది.

ప్ర. : మీకు నాటక సాహిత్యంపై మక్కువ కలగటానికి కారణమేమిటి? మీరు రాసిన నాటకాలేమిటి?

జ : అన్ని సాహితీ ప్రక్రియల్లో నాటక ప్రక్రియ సర్వశ్రేష్టమైనదని నా నమ్మకం. ఇందులో కవికి ప్రమేయం ఉండదు. అందులోని పాత్రలతో నాటకం సాగుతుంది. మనస్తత్వ వ్యక్తీకరణ ఇందులో ముఖ్యం. జీవితతత్త్వం ప్రతిపాదితమవుతుంది. అందువల్లనే నాకు నాటకమంటే ఇష్టం. ఈ కారణాల వల్లనే కోలాచలం శ్రీనివానరావుగారి నాటక సాహిత్యాన్ని పరిశోధనాంశంగా స్వీకరించాను. నేను 'విజయం మనదే', 'పదకవితా పితామహుడు' అనే నాటకాలు రాశాను. కొన్ని నాటికలతో 'దేశం బాగుపడాలంటే' అనే సంపుటాన్ని ప్రచురించాను.

ప్ర. : మీ పరిశోధనాంశంలో తెలుగు నాటక సామాజిక చైతన్యాన్ని గూర్చి మాత్రమే వివరించారా ?

జ : విషయం అదే అయినా ముందునుంచి ఉన్న తెలుగు నాటక వివేచన చేయడం జరిగింది. ఈ అంశాన్ని పదకొండు ప్రకరణాలుగా విభజించుకున్నాను. రెండో ప్రకరణంలో తెలుగు నాటకం 1860లో ప్రారంభమైనప్పటి నుంచి అంటే 'మంజరీ మధుకరీయం' మొదలుకొని 2000 సంవత్సరం వరకు అనేక పరిషత్తుల ప్రదర్శనలలో మన్ననలు పొందిన నాటకాలను స్పృశిస్తూ, వాటిలోని సామాజిక చైతన్యాన్ని పరిశీలించి, సామాజిక చైతన్యమంటే ఏమిటో తెలిపాను.

ప్ర. : సామాజిక చైతన్యం ఎప్పటి నుంచి, ఏ నాటకం నుంచి ప్రారంభమైందో చెబుతారా ?

జ : నిజం చెప్పాలంటే కోలాచలం శ్రీనివాసరావుగారి చారిత్రక నాటకాల్లోనూ, ప్రహసనాల్లోనూ సామాజిక చైతన్యం కోసం ప్రయత్నించినట్లు

వాతావరణ సూచన

గజానికొక గాంధారి కొడుకు తిరిగే
మన పవిత్ర దేశంలో
ఫైవ్‌స్టార్ హోటల్లో గడ్డి కూడా రుచికరం...
మస్కట్ల నుంచి రైఫిల్స్ దాకా
ప్రయాణం చేసిన పుణ్యభూమి మనది -
వీళ్ళకేం!
కొడవళ్ళు తినేస్తారు - ట్రాక్టర్లూ తినేస్తారు!!
మనుష్యులను 'పాన్' లాగా నమిలి
పడేస్తారు...!!
ఓట్ల వడగాల్పుల్లోని చలివేంద్రాలు వీళ్ళు...!
చలిచలిగా వుందని
మన ఇంటి తాటాకుల్నీ, బతుకుల్ని కాల్చుకు
తింటారు.
లేచే, నీలి మంటల్లో
ఆకాశంలో వాగ్దానాల కవిత్వం రాస్తారు.
అధికారం మబ్బులతో చెరిపేస్తారు.

ప్రజల పాలిట మదమెక్కిన దున్నలవుతారు
కొండలను తిని, అడవులను నంజుకుంటున్న
ఈ మహానుభావులున్న రోజుల్లో...
బ్రహ్మజెముడు పంట మొక్కల్లా పెరుగుతున్న
రోజుల్లో
మన పవిత్ర భారతదేశంలో
ఓ చోట వరదలే వస్తాయి... క్షామం రాదు.
మరోచోట క్షామమే నాట్యమాడుతుంది.
వరదలు రావు.
ఉష్ణోగ్రత వీళ్ళ వేలిచివర్న
నిలకడగా ఉండిపోతుంది.



- డా॥ జె.పి.వైద్య

బృందగానం

గది తన కిటికీ ఏనుగు చెవులతో
వింటో లేదో తెలీదు
గోడ గడియారం పెండ్యులం గుండె
స్పందనలో స్పందన వుందో లేదో సందేహం...
ఒంటరిగా వున్నప్పుడు
నాభిలోంచి తన్నుకొచ్చిన గానమైనా....
ఏదో అసహజం... ఇరుకు సందులో అమావాస్య రాతిరి నడకలా...
నా పాట నాకే
గుండె గుహలోంచి వినిపించే మూలుగులా
నవరసాలు పలికినా
నీరసంగా నిస్తేజంగా...
మన గొంతుకి ఒక్క మన గుండె పరవశించడం
స్వడబ్బా తాడనం!
అదే అలా వీధిలో కెళ్ళినప్పుడు...
రోడ్డు వార టెలిఫోన్ స్తంభాల్ని మోస్తూ
పాడే కూలీల పాట... చిలిపి పాటైతేనేం?...
గుండెల్లో రింగుమంటుంది....
అనివార్యంగా గొంతు జతకలుస్తుంది...
జనం ముందు గొంతు విప్పడం
సెలయేటి - సాగర సంగమం!...
నల్లని కనురెప్పల కింద
ఆనందంతో మెరిసే కళ్ళు
నిశిమబ్బు కురిసే నక్షత్రపు జల్లు...
ఆ జల్లులో నిలువెల్లా తడవటం - ఒక వరం...
నిజం!... సామూహికం ఎప్పుడూ హాయే!

- ఎస్.హనుమంతరావు

స్పష్టమవుతుంది. అయినా 1897లోనే ప్రజలను చైతన్యపరచడానికి గురజాడవారి 'కన్యాశుల్కం' నాటకం నిర్వర్తించిన కృషి అనన్య సామాన్యమైనది. చిన్నారులను ముసలివారికిచ్చి చేసే బాల్య వివాహాల ఖండన, ఆనాడు ఉన్న సామాజిక రుగ్మతల్లో కొన్నింటిని రూపుమాపడానికి గురజాడవారు చొరవ తీసుకొని చూపిన తీరు మరువలేనిది. మానవ మనస్తత్వాన్ని మానవీయ దృక్పథంలో ఆయా పాత్రల ద్వారా గురజాడ వారు వ్యక్తీకరించిన తీరు కన్యాశుల్క నాటకాన్ని ఈనాటికీ చిరంజీవిని చేసింది. తదనంతర కాలంలో జాతీయోద్యమ భావంతో దేశభక్తిపూరిత నాటకాలు, సంస్కరణోద్యమంతో కూడిన కాళ్ళకూరి నారాయణరావు గారి నాటకాలు వచ్చాయి. హేతువాద దృక్పథంతో కవిరాజు నాటకాలు వచ్చాయి.

ప్ర. : ***1970 తర్వాత నాటక స్థితి ఎలాగుంది?***

జ. : ఈ కాలంలో తెలుగు నాటకంలో పాశ్చాత్య నాటక ప్రభావం వల్ల అనేక ఆధునిక దృక్పథాలు వెలిశాయి. ప్రతీకవాదం, అభివ్యక్తీకరణ వాదం, ఎపిక్ థియేటర్, అబ్సర్డు థియేటర్, అస్తిత్వవాదం, మైమ్, ఆధునిక వీధి నాటకం మొదలైన ధోరణులు చోటు చేసుకున్నాయి. ఇందులో రాజకీయ నాటకాలు, స్త్రీ సమస్యాత్మక నాటకాలు ప్రాముఖ్యం వహించాయి. నాటక పోటీలు ప్రారంభమయ్యాయి.

ప్ర. : *నాటక పోటీల వల్ల తెలుగు నాటకాభివృద్ధి సామాజిక చైతన్యంతో జరిగిన తీరును వివరించండి?*

జ : 1980 నుంచి తెలుగు నాటకం నాటక కళాపరిషత్తుల వల్లనే జీవించిందని చెప్పడంలో సందేహం లేదు. సమాజంలోని అన్ని రుగ్మతలను అద్దంలో చూపినట్లు పరిషత్తుల వల్ల వచ్చిన నాటక, నాటికల్లో విశదమవుతుంది. కుటుంబ జీవన విధానంలో మార్పు, మానవ సంబంధాల్లోని లోపం మొదలైన అంశాల్ని ఎత్తి చూపాయి. ఈ నాటకాలలో ధన ప్రాధాన్యం, వృద్ధాప్య సమస్యలు, దిగజారిన పోలీసు వ్యవస్థ, విద్యా వ్యవస్థ, కుళ్ళు రాజకీయాలు, ఫాల్స్ ప్రిస్టేజి, శ్రమదోపిడి వీటిని మించి స్త్రీవాదం, దళితవాదం, గిరిజన సమస్యలు ప్రాధాన్యం వహించాయి.

ప్రశ్న : *ఈ మధ్య వచ్చే నాటకాలలో జీవిత విలువల ప్రాధాన్యత లేదని అంటున్నారు. దీనితో మీరు అంగీకరిస్తారా?*

జ : మనల్ని మనం కించపరచుకోవడం ఇప్పుడు గొప్ప రివాజు అయింది. ఆత్మస్తుతి చేసుకోవడం ఎంత తప్పో, ఆత్మ నింద చేసుకోవడం అంతే తప్పు. జీవితాన్ని ప్రతిబింబించే నాటకం కన్యాశుల్కం. వీటి తర్వాత కూడా మంచివి వచ్చాయి. ధర్మవరం, కోలాచలం, చిలకమర్తి, తిరుపతి వేంకటకవులు, బలిజేపల్లి, కాళ్ళకూరి నాటకాలు పేర్కొనదగినవి. తర్వాత పి.వి.రాజమన్నార్, చలం, ముద్దుకృష్ణ, పినిశెట్టి, అనిశెట్టి, ఆత్రేయ, ఎన్.ఆర్.నంది ప్రభృతులైన పాతతరం మొదలు, కావూరి, వి.ఎన్. కామేశ్వరరావు, పాటిబండ్ల ఆనందరావు, ఆకెళ్ళ, భాస్కరచంద్ర, అత్తిలి పద్మావతి, అత్తిలి కృష్ణారావు, తనికెళ్ళ భరణి, విజయభాస్కర్, ఆరిశెట్టి, వల్లూరి, స్నిగ్ధ, గూడూరు విశ్వనాథ శాస్త్రి మొదలైన వారు తెలుగు నాటక రంగాన్ని సుసంపన్నం చేస్తున్నారు. వీరందరూ అభినందనీయులు.

ప్ర. : పరిషత్తుల షరతుల వల్ల తెలుగు నాటకాలు మూసబోసినట్లు తయారవుతున్నాయనే విమర్శ ఉంది. దీనికి మీరేమంటారు?

జ : నిజమే. ఈనాడు పరిషత్తుల షరతుల ప్రకారం రాసే నాటకాలు మూసబోసినట్లుగాక జీవితానికి అద్దం పట్టేవిగా ఉండాలన్నది మనందరం కోరుకునే అంశం. సందేహం లేదు. వైవిధ్య భరితమైన నాటకాలు, నాటికలు రావలసి ఉన్నమాట వాస్తవమే.

ప్ర. : నంది అవార్డులిస్తూ ప్రభుత్వం తెలుగు నాటకానికి, నాటికల అభివృద్ధికి కారణమవుతుంది. కానీ ఇందులో కూడా కొన్ని లొసుగులు ఉన్నాయంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం?

జ : మానవులు స్వపర భేదాలకు, స్వార్థాలలో కొన్నింటికి లొంగుతారు. అన్నింటికీ అతీతంగా ఉండటం ఎంతైనా అవసరం. అలాంటి స్వర్ణయుగం నాటక రంగానికి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ❖

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

బాధ్యతలు చూసినా అన్యాయం చేశారు

సరిగ్గా పదినెలల క్రితం. మా గ్రామ ప్రెసిడెంట్, మండలంలోని ఎస్.ఐ.గారు, వారి పోలీసులు మా తండ్రీ కొడుకుల మధ్య కుటుంబ, ఆస్తి తగాదాలని ఆసరా చేసుకొని నాకు రాత్రి 10 గంటల సమయంలో ఒక దౌర్జన్యకరమైన తీర్పు ఇచ్చారు. దానివల్ల నేను తీర్చిన అప్పులు, నా ఆస్తి వాటా కూడా నా అన్న కుటుంబానికి దౌర్జన్యంగా (బ్రోకర్లు తోడయి) పెద్దమనుషులుగా వ్యవహరించి, పోలీసులు కూడా కుమ్మక్కై (ప్రెసిడెంట్‌తో) ఈ దొంగతీర్పు ఇచ్చారు. దీనికి కారణం గ్రామంలో ప్రెసిడెంట్‌గారు చేసే కొన్ని దుర్వినియోగ పనులను నిలదీయడం మూలాన నేను ప్రెసిడెంట్ ఆగ్రహానికి గురయ్యాను.

మాది ఉమ్మడి కుటుంబం. ఒక ఇల్లు, నాన్న కట్టింది. ఒక ఇల్లు అన్నయ్య పేర (చిట్టిబాబు) కోలనీ ఇల్లు వచ్చింది (1985-86) దాన్నికూడా నాన్న చాలా మొత్తం వరకు పూర్తి చేశారు. మా అన్నయ్య ఒక పావువంతు సహకరించి వుంటాడు. అప్పటికి నా వయసు 16 సంవత్సరాలు. చదువుకుంటూ ఇంటిపని (శ్రమదానం) చేసేవాడని, అన్నయ్య మాత్రం పనుంటే చేసేవాడు కాదు. (ఇంజనీరింగ్ వర్క్) వాడి వ్యసనాలు తీరగా మిగిలితే ఇంటికి ఇచ్చేవాడు. వాడు ఎన్ని చేసినా (చెడుపన్లు) పెద్ద కొడుకు అయిన మూలంగా సరిపెట్టుకుపోవడం మినహా ఏమి చేసేవారు కాదు. అప్పటికి మాకున్న 33 సెంట్ల భూమి కూడా అమ్మి వర్క్ షాపు (ఇంజనీరింగ్స్) పెట్టడం జరిగింది. అప్పటికి అన్నయ్యకి పెళ్ళికూడ జరిగింది. ఆయనకి ముగ్గురు పిల్లలు. ఒక మగపిల్లాడు, ఇద్దరు ఆడపిల్లలు. 1994 సెప్టెంబర్‌లో వ్యవసనాల నుండి బయటపడని కారణంగా చనిపోయాడు. వైజాగ్‌లో నేను ప్రైవేట్ ఇంజనీరింగ్‌లో పనినేర్చుకుంటూ బ్రతికేవాడిని. అన్నయ్య చనిపోయాడని తెలిసి నేను ఇంటికి వచ్చాను. తరువాత పరిస్థితులు అన్నీ అధ్వాన్నంగా ఉన్నాయి. ఇంజనీరింగ్ షాపు 63 వేలు అప్పులో వుంది. ఇతర అప్పులు కూడా 20 వేలు వరకూ ఉన్నాయి. షాపుని అప్పులవారు వేలం వేస్తుంటే అందరు చెప్పగా ఆదుకున్నాను. షాపు అప్పులు తీర్చుతూ నేను బతుకుతూ 63 వేల అప్పులు తీర్చాను. 80 వేల రూపాయలు పెట్టి అన్నయ్య పెద్దకూతురుకి పెళ్ళికూడా చేశాను. షాపు పెట్టుబడి, అప్పు నిమిత్తం మానాన్న దగ్గర ఒక రూపాయి కూడా తీసుకోలేదు. అంతా నాకష్టం మీదే తీర్చాను. అన్న కూతురు పెళ్ళి సందర్భంగా కొన్ని గొడవలు జరిగాయి. ఆ పెళ్ళి కొడుకుతో పెళ్ళేగాని జరిగితే నేను నా అన్నయ్య కుటుంబం పట్ల ఏ విధమైన బాధ్యత ఉంచుకోనని తెగేసి చెప్పడంతో మా నాన్న అప్పటి నుండి నాపై కక్షకట్టి నేను తీర్చిన అప్పు విషయంలోను, ఇంటివిషయంలోను నాకు ఏమి లేకుండా చేయాలని కుట్రపూరితంగా దత్తుడితో జతకట్టి దొంగ ప్రెసిడెంట్‌ని తోడుని తీసుకొని అన్నయ్య ఇంటిని ఉమ్మడిలోకి తీసుకొనకుండా నా యింటిని మూడు వాటాలు, షాపుని 3 వాటాలు (నాన్న, అన్నయ్య, నేను) వేశారు. ఇది పెద్దమనుషులు రాయించిన కాగితాలు మాత్రమే. దీనికి పోలీసులు కూడా వచ్చారు. (మైత్రీ సంఘం ఆధ్వర్యంలో) ఎస్.ఐ.గారు తగువు చివరి వరకూ లేరు. కానిస్టేబుల్ మాత్రం ఉన్నారు. ఆ కాగితాలు పోలీసు వాళ్ళ దగ్గర మాత్రమే ఉన్నాయి. ఇంత ఉదారంగా పోయినందుకు నాతండ్రి నమ్మక ద్రోహం చేశాడు. ఈ తగువునుండి బయటపడడానికి నాకు సరియైన న్యాయసలహా ఇస్తారని కోరుతున్నాను. కాగితాలు రాశారు కాని ఇప్పటికీ ఇంకా పంపకాలు కాలేదు. ఆ షాపుని నేనే మెయింటినెన్స్ చేస్తున్నాను.

– ఎస్. వివేకానంద, తిమ్మరాజుపేట, విశాఖపట్నం

మీరు ఉదార స్వభావంతో కుటుంబాన్ని ఆదుకున్నారు. న్నగారు మిమ్మల్ని వైజాగ్ నుండి మీ అన్నయ్య గారు చనిపోయేటప్పుడు అప్పలు రాబడి, అని ఏమైనా కాగితాలు ఉన్నాయా? లేనట్లుగా కనబడుతుంది. మీరు కష్టపడి అప్పలు తీర్చినట్లు రుజువులేమి లేవు. మీ ఉమ్మడి కుటుంబపు ఆస్తిగా మీ నాన్నగారు ఆస్తి తాను సంపాదించినదా? తాత ఆస్తినా తెలుపలేదు. మీకు మీ నాన్నగారితో తగాదాలు మీ అన్నయ్య కూతురి పెండ్లి కారణంగానే అనడం ఉదార స్వభావులైన మీకు ఎంతవరకు సమంజసం. మీ అన్నయ్య కూతురు ఇష్టాఇష్టాలపై ఆధారపడాలి. కాని పెళ్ళి విషయంలో మీ జోక్యం అంతబలంగా రుద్దాలనుకోవడం బాగాలేదు. షాపు ఎవరి పేరు మీద ఉన్నది తెలుపలేదు. మీ పేరు మీద ఉండి ఉంటే మీ నుండి మీ నాన్నగారు, అన్నయ్యగారి పిల్లలు కోర్టు ద్వారాగానే రావాలి. పోలీసుల జోక్యం ఈ విషయంలో కుదరదు. మీరు వారి పై అధికారుల్ని సంప్రదిస్తే పోలీసుల జోక్యం ఉండదు. ఇరుపక్షాలు వింటేనే పెద్దమనుషుల జోక్యం లేక మీరు వినదల్చుకోకుంటే వినకండి. కోర్టుకెళ్ళమని చెప్పండి.

సంధ్య ఆయేషాగా మారాలంటే...

నేను ఎస్.సి.ని. ప్రేమించి ముస్లిం అబ్బాయిని పెళ్ళి చేసుకున్నాను. ముస్లిం మతాచారం ప్రకారం పెళ్ళి జరిగింది. కానీ నా సర్టిఫికెట్స్‌లో ఎస్.సి. అని ఉంది. నా పేరును సర్టిఫికెట్‌లో ముస్లిం పేరుగా మార్చుకోవాలని ఉంది. దీని గురించి పూర్తి సమాచారం తెలియజేస్తారని ఆశిస్తున్నాను. ఎస్.ఎస్.సి. సర్టిఫికెట్‌లో ఉన్న నా పేరు సంధ్యను ఆయేషాగా మార్చుకోవాలని ఉంది. దీని గురించి పూర్తి సమాచారం అందజేస్తారని ఆశిస్తున్నారు.

- కె.సంధ్య, కర్నూలు.

ప్రభుత్వ ప్రెస్‌లో పేరు మార్పుకోసం దరఖాస్తులుంటాయి. ఆ దరఖాస్తులు ఒకటి మీరు, రెండవది ఎమ్.ఆర్.ఓ. సంతకంతో నింపాల్సి ఉంటుంది. ఆ పత్రాలని సెంట్రల్ గవర్నమెంట్ ప్రెస్‌లో సమర్పించిన తర్వాత ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ముద్రిస్తారు. ఆ రోజు నుండి మీరు మీ కొత్త పేరు మార్చుకోవచ్చు. పత్రాలకు, పూర్తి వివరాలకు చంచల్‌గూడ, హైదరాబాద్ గవర్నమెంట్ ప్రెస్‌లో సంప్రదించవలసి ఉంటుంది.

కొత్తిమీర అన్నం

కావలసిన వస్తువులు:

బియ్యం : 1 కిలో
కొత్తిమీర : 6 కట్టలు (చిన్నవి)
మంచినూనె : 150 గ్రాములు
వేరుశనగ గుళ్ళు : 100 గ్రాములు
పచ్చిశనగపప్పు : 100 గ్రాములు
పచ్చిబఠాణీ : 250 గ్రాములు
క్యారెట్లు : 250 గ్రాములు
బీన్స్ : 250 గ్రాములు
టమాటా : 250 గ్రాములు
అల్లం, వెల్లుల్లి : నూరుకున్న ముద్ద(తగినంత)
పసుపు : ఒక టీస్పూన్
ఉప్పు : తగినంత
నిమ్మకాయలు : నాలుగు
కరివేపాకు : రెండు రెబ్బలు

తయారుచేయు విధానం:

అన్నం, బఠాణీలు, వేరుశనగ గుళ్ళు, బీన్స్, క్యారెట్ ముక్కలు వేరువేరుగా ఉడికించి రెడీ చేసుకోవాలి. కొత్తిమీరను మిక్సీలో గానీ, రోటిలో గానీ మెత్తటి ముద్దలా నూరుకుని ఉంచుకోవాలి. అల్లం, వెల్లుల్లి కలిపి నూరిన ముద్ద సిద్ధం చేసుకోవాలి. వెడల్పాటి గిన్నెలో అన్నం, పసుపు, రెండు చెంచాల నూనె, తగినంత ఉప్పు వేసి కలపాలి. కొత్తిమీర పేస్టును కూడా ఆ అన్నంలో బాగా కలపాలి. బాండీలో కాగిన నూనెలో తాలింపు పెట్టి, దానిలో అన్నీ కలిపిన కొత్తిమీర అన్నం మిశ్రమాన్ని వేసి మూతపెట్టి కాసేపు వేగనివ్వాలి. దించిన తరువాత నిమ్మకాయ రసం పిండుకోవాలి.

శ్రీహోళి

కావలసిన వస్తువులు:

పెసలు: పావుకిలో
ఉల్లిపాయలు: పావుకిలో
టమాటాలు: పావుకిలో
పచ్చిమిర్చి: నాలుగు
బెల్లం: 50 గ్రాములు
చింతపండు: 50 గ్రాములు
మంచినూనె: 150 గ్రాములు
తాలింపుదినుసులు: పోపుకు సరిపడినన్ని

తయారుచేయు విధానం:

పెసలు ముందు రోజు రాత్రి నానబెట్టుకోవాలి. ఉదయాన్నే మిక్సీలో గానీ, రుబ్బురోలులో గానీ గట్టిముద్దగా రుబ్బుకోవాలి. ఉప్పు లేకుండా దిబ్బరొట్టెల్లా అట్లు వేయాలి. డైమండ్‌లుగా గానీ, త్రికోణాలుగా గానీ ముక్కలు చేసుకుని ఉంచుకోవాలి. ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, టమాటాలు సన్నగా తరిగి సిద్ధం చేసుకోవాలి. బాండీలో నూనె పోసి, మరిగాక తాలింపు పోపుపెట్టి, కాసేపాగాక ఉల్లి, మిర్చి, టమాటా ముక్కలు వేసి దోరగా వేగనివ్వాలి. ఆ తరువాత చింతపండు పులుసు పోయాలి. పులుసు మరుగుతుండగా పెసరట్టు ముక్కలు వేయాలి. కొద్దిసేపాగి బెల్లం వేయాలి. తగినంత ఉప్పు వేయడం మర్చిపోరు కదా! పులుసు దగ్గరగా, గుత్తంగా అయ్యాక, దించి ఇష్టపడేవాళ్ళు మసాలా చల్లుకోవచ్చు. కొత్తిమీర పైన చల్లుకుంటే బాగుంటుంది.

పంపినవారు: టి. అనూరాధ, కూకట్‌పల్లి, హైదరాబాద్

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకు్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి అలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : బండారి ప్రదీప్‌గౌడ్
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి, పుస్తకాలు, కథలు చదవడం, డాన్స్ చేయడం, క్రికెట్ ఆడడం.
చిరునామా:
బండారి ప్రదీప్‌గౌడ్, మాసానిపల్లి (గ్రా), ఆత్మకూరు (పోస్ట్), నాగిరెడ్డి పేట్ (మం), నిజామాబాద్ జిల్లా.
పిన్: 503 122.

పేరు : వి.వందన
వయసు : 9 సం॥
చదువు : 3వ తరగతి
హాబీలు: టీవీ చూడడం, టీచర్ ఆట ఆడడం.
చిరునామా:
వి.వందన,
డాటరాఫ్ వి.వి.ఎస్.ఎన్.రాజు,
గణేష్ నగర్,
ఆముదాల వలస.

పేరు : గాదిపర్తి సాహితి
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
స్కూలు: శాంతినికేతన్ హైస్కూల్
హాబీలు: ప్రజాశక్తి చదవడం, డాన్స్ చేయడం, పాటలు పాడడం.
లక్ష్యం: డాక్టర్ కావడం
చిరునామా:
జి.సాహితి, డాటరాఫ్ జి.రాధాకృష్ణ, ప్లాట్ నం.30, శాంతినగర్, వనస్థలి పురం, హైదరాబాద్. **పిన్:** 500 070.

పేరు : బి.రోహిత్ (బబ్లు)
వయసు : 11 సం॥
చదువు : 7వ తరగతి
స్కూలు: శ్రీ కాకతీయ హైస్కూల్
హాబీలు: క్రికెట్, చెస్ ఆడడం, చదవడం, టీవీ చూడడం, కలంస్నేహం చేయడం,
లక్ష్యం: ఐ.ఎ.ఎస్ (కలెక్టర్) కావడం
చిరునామా:
బి.రోహిత్, సన్నాఫ్ బి.రామకృష్ణ, **O/o KES** పాలిటెక్నిక్ కాలేజ్ (ఉమెన్స్), నియర్ పి.డబ్ల్యు.డి.గ్రౌండ్స్ విజయవాడ.

పేరు : డి.అక్షయ్‌కుమార్
చదువు : 4వ తరగతి
హాబీలు: డ్రాయింగ్ వేయడం, బొమ్మలు తయారు చేయడం. పండుగలకు సంప్రదాయబద్ధంగా వస్తువులను అలంకరించడం.
చిరునామా:
డి.అక్షయ్‌కుమార్,
సన్నాఫ్ విజయ్‌కుమార్,
తుకారాం గేటు, సికింద్రాబాద్.

పేరు : జి.అనూష
వయసు : 8 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు: జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం, బొమ్మలు వేయడం.
చిరునామా:
జి.అనూష,
డాటరాఫ్ జి.రామసుబ్బారెడ్డి,
ఫ్లాట్ నం: 203,
సాయిసంతోషి రెసిడెన్సీ, వీధి నం-1,
తార్నాక, హైదరాబాద్.

పేరు : జి.ప్రత్యూష
వయసు: 11 సం॥
చదువు: 6వ తరగతి
హాబీలు: డ్రాయింగ్ వేయడం, డాన్స్ చేయడం, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం.
చిరునామా:
జి.ప్రత్యూష, డాటరాఫ్ జి.రామసుబ్బారెడ్డి,
ఫ్లాట్ నం: 203,
సాయి సంతోషి రెసిడెన్సీ, వీధి నం-1,
తార్నాక, హైదరాబాద్.

పేరు : ఎస్‌కె అబ్దుల్ రహమాన్
వయసు: 10 సం॥
చదువు: 5వ తరగతి
హాబీలు: ఆటలు ఆడడం, చదవడం, పాటలు పాడడం.
చిరునామా:
ఎస్‌కె అబ్దుల్ రహమాన్,
సన్నాఫ్ మీరావలి (ఆర్టీసీ డ్రైవర్),
మెలోడి ఫర్నీచర్స్ & హోమ్ నీడ్స్,
సినిమా హాల్ రోడ్,
ఇంకొల్లు - 523 167.